కథా నిలయం
3450
శ్రీకాకుళం

# నిరంతరత్రయం

ప్రపంచంలో నేటి అరిష్టాలకి కారణం. తెలివిహీనులు నిస్సంకోచంగా ప్రవర్తించడం. తెలివిగలవారు శంకలతో, సందేహాలతో గాధపడి అసహాయులవడం—అన్నాడు ఒక మేధావి. సంవత్సరాది సంచిక కథ వ్రాద్దామని బుర్ర గాలించడం మొదలెట్టేసరికి, అన్నీ శంకలే. సందేహాలే. కథావస్తువుతో అసంతృప్తి. పాత్రలపై అపనమ్మకం. ప్రయోజనంపై అవిశ్వాసం. తెలివితేటలు రచయితకి ఆటంకమేమో ననిపించింది కాని ఒక విశ[illegible] [illegible] రాగలిగాను. ప్రేమ కథ మాత్రం వ్రాయకూడదని. రాజకీయ చై[illegible] ప్రబలిపోయిన యీ రోజుల్లో ప్రేమకథల ప్రచారం తగ్గి[illegible]వన్నీ దగా అనీ. అవి రాసేవాళ్ళు సమాజానికి శత్రువులనీ, పాఠకులలో ఒక అభిప్రాయం స్థిరపడుతోందని నాకనిపించింది. ఇప్పుడు సంఘాన్ని, సంస్థలని, తెగలని, కూటాలని విమర్శించి, భూస్వామి తత్వాన్నుండి బైలుదేరిన విలువల్ని హేళనచేసే కథలకే ఎక్కువ పలుకుబడి. సంఘంలోని అన్యాయానికీ అక్రమానికీ, అధర్మానికీ కారణం 'దేవుడు', 'కర్మ' కారు. ఆర్థిక పరిస్థితులేననీ, వాటిని నలుగురం కూడబలుక్కుని సరిదిద్దొచ్చుననీ, జనానికి తెలిసిపోయింది. పాత్రలు, తరగతులకు చెందేవారవాలి గాని, వ్యక్తిత్వం. 'ప్రత్యేకత' గలవాడు కాకూడదు. ధనికులపై ద్వేషం, బీదలపై సానుభూతి పురిగొల్పాలి. మిల్లు యజమానిని నిర్మూలించడం యీనాటి సాహిత్యంలో 'ఫాషన్.'

ఇదంతా తప్పు చారిత్రక, రాజకీయ పరిస్థితులవల్ల సంఘాన్ని పరిశీలించి, సంస్కరించడం కళ పనికాదు; కావాలంటే దానికోసం వ్యాసాలు వ్రాయండి, ఉపన్యాసాలివ్వండి, ఉద్యమాలు లేవదీయండి కాని. 'కథల్లోకి దించకండి బాబూ అని నాబోటిగాడు మొరెట్టుకుంటే వినేదెవరు? నా కథలు నలుగురూ చదవాలంటే యీ రకం సామాజిక ప్రయోజనంతో కూడుకున్న కథలు వ్రాయాలి. లేకపోతే, వ్రాయడం మానుకుని యే బళ్ళోనో మేష్టరుగా ప్రవేశించాలి నాకంటె ముందుగానే ఆపని సినిమాలు చేస్తున్నాయి గనక, ప్రేమ తత్వంవల్ల పిల్లలు పాడవుతారన్న భయం ఎవ్వరికీ లేదు,

ప్రేమకథ వ్రాయకూడదన్న నిశ్చయానికి రాగలిగినా, సామాజిక నిర్మాణాన్ని చిత్రించే కథలని గురించి అనుమానాలు రాసాగాయి. వ్యక్తులు, రాజకీయ ఆర్థిక పరిస్థితులకు లొంగిపోయి, కీలుబొమ్మలైన పక్షంలో, వారి ప్రవర్తనకి వారు బాధ్యులు కారు; సమాజం అవుతుంది. అట్లాంటప్పుడు మంచి చెడ్డలకు, నైతిక విలువలకు స్థానమే వుండదు. బాహ్య ప్రపంచంలో శక్తులకు లొంగిపోకుండా, వాతావరణానికి అతీతం కాగలిగినప్పుడే, వ్యక్తిగతమైన నీతి ప్రస్తావనకి తావుంది. ఇల్లా అనుకోడంకూడా భూస్వామితత్వపు నాగరకత లక్షణమేనంటే నేనేం చేసేది?

ఈ రకం ఆలోచనలోపడి కొట్టుకొంటూండగా, తక్షణం బైలుదేరి రమ్మని కరుణాకరం దగ్గరనుంచి, టెలిగ్రాం వొచ్చింది. నన్నెందుకు రమ్మన్నాడో చటుక్కున స్ఫురించకపోయినా, నా కర్థమైనట్లనిపించింది. నన్ను రమ్మన్న కారణం ఏమిటో సరిగ్గా నిర్ణయించి చెప్పగలిగితే, ప్రేమ కథాసాహిత్యానికీ, సామాజిక కథాసాహిత్యానికీగల తారతమ్యానికి నే కట్టిన విలువల ఔచిత్యం, పాఠకులే పోల్చుకుంటారన్న ఆశతో, యీ రచన సాగిస్తున్నా.

కొత్తరకం కథాసాహిత్యాన్ని ఉపాసించేవారు కరుణాకరాన్ని నాయకుడుగా అంగీకరించొచ్చు? మిగత విషయాల మాటటుంచి, అతను చాలా బీదవాడు. బీదతనానికి సంబంధించిన, అణకువ, నమ్రత, భయం, సిగ్గు మొదలైనవి అతనిలో ఉన్నాయి. పది

సంవత్సరాలనాటి మాట— అతనూ, నేనూ కాలేజీలో చదువుకున్నాం. హాస్టల్లో మా పక్కగదిలో ఉండేవాడు. హాస్టల్ ఖర్చంతా, ఏదో నలుగురు స్నేహితులం భరించేవాళ్ళం — ఎక్కువ భారం కామేశం మీద పడేది. కామేశం పెద్ద స్థితిపరుడు — సరదాకోసం చదువుకునే ఖులాసా పురుషుడు: మంచి టెన్నిస్ ఆటగాడు. టెన్నిస్‌కోసం కాలేజీ చదువనేవాడు. భాగ్యానికీ, టెన్నిస్ ఆటకీ ఏదో సంబంధం ఉన్నట్లనిపిస్తుంది కరుణాకరం దుస్తులు, సినిమాలు, నాటకాలు, టిఫిను — అన్నీ అతనే ఆదుకునేవాడు. కృతజ్ఞతని వ్యక్తంచేసే భయ భక్తులు కనబరిచినా, కరుణాకరం కామేశాన్ని స్తోత్రం చెయ్యడం కాని, అతనన్నదానికల్లా తందానతానా అనడం — మొదలైన మానసిక బానిసత్వాన్ని సూచించే లక్షణాలని ప్రదర్శించేవాడు కానట్లే నాకు గుర్తు. కరుణాకరం, క్లాస్ పరీక్షల్లో ఫస్టు మార్కులు తెచ్చుకునే వాడు — బీదవాళ్లు క్లాస్‌లో ఫస్టుగా మరి — అసలా కారణం వల్లనే, అతన్ని మేం తొందరగా మరిచిపొయ్యామేమో ననిపిస్తుంది. నేనా సంవత్సరం ఫేలయ్యాను, వాళ్ళిద్దరూ ప్యాసై, పై చదువులకి పట్నం వెళ్ళారు. మా మార్గాలు విడిపొయ్యాయి.

ఏడెనిమిది సంవత్సారాలవరకూ, మేం మళ్ళా కలుసుకోటం పళ్ళేదు. మనదేశం పెద్ద విస్తీర్ణంకలిగి ఉండడంవల్ల కలిగే అనర్థా లలో, స్నేహితులు కలుసుకోలేక పోవటం ఒకటి. చదువుకునే రోజుల్లో స్నేహాలు శాశ్వతమనీ, ఎప్పుడూ అంతా కలిసి వొక చోటనే ఉంటామనీ అనుకుంటూ, సెలవల్లో ఉత్తరాలకోసం ఇరవై పేజీల ఎక్సర్‌సైజ్ పుస్తకాలని ఖర్చుపెడుతూ ఉండేవాళ్ళం. తరవాత, తరవాత, స్నేహితుల కలయిక, మరో లోకంలోనేమో అనిపించేటట్లుగా పరిణమించింది. అంతేగాదు, వాళ్ళంతా ఏమయ్యారో వాళ్ళ జీవితాలు ఏవిధంగా పరిణమించినవో ఊహించేటందుకు కూడా వ్యవధి ఉండేదికాదు. ఏమిటో జీవితంలో ప్రధానమైన సమస్యలన్నీ ఒక్కసారిగా యవ్వనా న్నెదుర్కుంటాయి. ఓ మూల స్నేహాలు, చుట్టరికాలు, బాంధవ్యాలు, మర్యాదలూ; మరోప్రక్క సౌందర్యో పాసన, ప్రేమ, ఆదర్శమూర్తి, స్వప్నజగత్తు; ఇంకా సంఘంతో

పోటీపడి. జీవనోపాధికై ఉద్యోగాన్వేషణ పెద్దల సలహాలు, విమర్శ నలు, తీర్పులు—ఎవరి నీడ వారికే భయమేస్తుంది—నీడలు పొడుగ్గా ఎదిగిపోతున్నట్లు. వార్ధక్యంలో నిజంగా ప్రశాంతత, హాయి ఉన్నాయి. ముఖ్యంగా కొందరు వ్యక్తుల జీవితానుభవ నిర్మాణం మనం ఊహించినట్లుగా సాగిందీ లేనిదీ — పర్యవసానం తెలుసుకునే అవకాశం. వార్ధక్యానికుంది.

మాదో పదెకరం ఇనామ్ భూముంది, అది కాస్తా కవులు దారుడికి భుక్తం కాకుండా, అమ్మెయ్యమని శ్రేయస్కాముల సలహా. మంచి చెడ్డలను, ప్లీడర్‌గారి నోటంటే విందామని, హయగ్రీవంగారిని పట్నంలో కలుసుకున్నాను. -యనదగ్గర కామేశం, ఎప్రెన్‌టిస్‌గా ఉంటున్నాడు. నన్ను చూడగానే ఆప్యాయంగా కౌగిలింతలో ముం చేశాడు. ఎక్కడికీ వెళ్ళడానికి వాల్లకాదనీ తనదగ్గరే ఉండాలనీ. తన కార్లో ఎక్కించుకుని తీసుకుపోతున్నాడు నర్సింగ్ హోమ్‌దగ్గర దిగాం. తిన్నగా లోపటికి తొమ్మిదో నెంబరు గదిలోకెళ్ళాం. వరండాలో ఉన్న రెండు పేముకుర్చీలని లోపలికి తనే మోసికెళ్ళి నన్ను ఒకదాంట్లో కూలవేశాడు

"మేలుకోవమ్మా, మహారాణీ—నేను చెబుతూండే వాణ్ణె— ది కమింగ్ ఆథర్—ప్రసిద్ధ రచయిత...." అంటూ కామేశం నా బుజాన్ని నలిపేశాడు. మంచంమీద పరున్న వ్యక్తి పసుపు పచ్చ రగ్గు కాస్త దించి మా పక్కకు తిరిగి చూసింది.

"మా గృహిణి—ఇది మా గృహం కాదు కాబట్టి, నర్సింగ్ హోమిని"అని నవ్వడం సాగించాడు కామేశం. ఆమె రెండో చేతిని రగ్గులోంచి పెల్లిగించి, నమస్కారం చేసింది. చేతికి ఎర్రరిబ్బన్ రిస్టువాచ్, రెండో చేతికి, ఎర్ర ప్లాస్టిక్ గాజు, తలకి ఎర్రపిల్కు మఫ్లర్, 'జ్వాల' ఆకారంలో ఎర్రబొట్టు, పల్చటి ఎర్రటి పెదవులు- నీరసించి కరుగుతున్న సంధ్యాదేవిలా, మంచం అంతటా—పాత బడి ఎరుపెక్కిన బంగారంలా—వ్యాపించి వుంది, కామేశం భార్య.

జబ్బుతో మంచానపడిన స్త్రీలు నా కెందుకో అందంగా కనిపి స్తారు ఒకరకం అస్వస్థత, ప్రతివారికీ అప్పుడప్పుడు కలుగుతుండాలని

నా వుద్దేశం. అస్వస్థత, శరీరాన్ని కడిగి శుభ్రపరుస్తుంది— మనస్సుని పవిత్రం చేస్తుంది: ఉద్రేకాలని, సుడిగుండంలో తిప్పి, స్వప్నంలో కదుల్తున్న ఉపనదిలా ప్రవహింపజేస్తుంది; కాంక్ష, కామం, మమకారం—అన్నీ శిఖరం తాకిడికి విడిపోయిన నల్లమేఘాలలాగా, చీకటి హృదయాలని వికాసంతో పొడుచుకొని, విడిపోయి, తీయటి వర్షంగా కళ్ళలోపడి, తడితో మెరుస్తాయి. ఆకాశం వాంఛతో ఎగిరిన కెరటంలోని నీలం, ఆమె కళ్ళకింద విశ్రమించింది. రేఖలు రేఖలుగా పాయలు పాయలుగా, కనురెప్పలకింద పచ్చగా ప్రాకులాడుతూ, నీలం తెల్లబడి, పళ్ళవరసలోకి జారింది.

"అల్లా తెల్లబోతావేం—నీకు పెళ్లాంవుంటే.ఇలాంటి జబ్బు రావాలనుందా యేం—?" అని, కామేశం బుజం చరిచాడు. నేను అదిరిపడ్డాను. అస్వస్థతలోని అందం చూడగల్ను కాని, వ్యాధిగ్రస్తులను పరామర్శ చెయ్యడం నాకు చేతగాదు. అందులో స్త్రీలను ఎట్లా పలకరించటం?

"ఏం జబ్బు—చెప్పుకో—" అన్నాడు కామేశం.

అమాయకంగా తల తిప్పాను.

"మనిషి చిక్కని జబ్బుకి, కావల్సింది విశ్రాంతి చికిత్స—రెస్టక్యూర్."

కామేశం నా వినోదం కోసం మాట్లాడుతున్నాడో, లేక మనిషి ధోరణే అంతో తెలీదుకాని ఆ వాతావరణంలాగే ఆ సంభాషణ కూడా అతిశయోక్తిగా, అసహజంగా కనిపించింది.

ఆవిడ లేచింది, బ్రెడ్. కాఫీ కప్పు ట్రేలో అమర్చి, తీసుకొచ్చి నా ముందు పెట్టింది,

"మీ రచనలు అప్పుడప్పుడు చదువుతూంటాను" అంది.

"కొంపలు తీసే కథలు వ్రాయడం ఎప్పటినుంచి మానేస్తున్నావు?" అని కామేశం నవ్వడం సాగించాడు.

కథలు చదివి కొంపలు తీసుకోడానికి సాహసించే వ్యక్తులుంటే, రచయితకి సంఘంలో గౌరవప్రదమైన స్థానం లభించివుండేదని లోపల అనుకున్నాను.

"నిర్మోహమాటంగా, కచ్చితంగా చెప్పడం అవసర
ము. ఎవరి కొంప వారు తీసుకునే ధైర్యం లేనప్పుడే, ...
దుల ...పలు తియ్యటం జరుగుతుంది. కాదంటారా?" అన్నాను
ఆమె ... కష్టాల్లో ఆ వాక్యం బాగా అర్థం కాకపోయినా, ఆమెకి
...వం హెచ్చింది.

"ఆయన కథల్లో ఎంతో అనుభవం ఉంది" అన్నది ఆమె. కొంత నమ్రతతో గర్వం సూచించాను. కుర్చీలోంచి లేచాను కూడా. స్త్రీ నా రచనలను మెచ్చుకోటం కొత్త అనుభవం.

"తప్పు. ప్రేమంటే అనుభవం లేనివాడే మంచి ప్రేమ కథలు వ్రాయగల్గుతాడు. అపూర్వమైన అనుభవం పొందినవాడు, దాన్ని, యితరులతో పంచుకోడం అసహజం. అనుభవం కోసం ప్రాకులాడే వాళ్ళే అసందర్భపు రచనలు సాగించడం...." అనేసి, కామేశం కుర్చీలు మండువాలోకి జేరేశాడు.

"కామేశం! నువ్వు - సారస్వత విమర్శకి పూనుకోగూడదూ," అని అడిగాను.

"జీవిత విమర్శకి తట్టుకున్న తర్వాత, సారస్వత విమర్శ" అన్నాడు, పైప్‌లోకి పొగాకు అమర్చే తతంగం జరుపుతూ.

"సుగుణా—నువ్వూ ఇల్లా వొచ్చి కూర్చో" అని కేకేశాడు. సుగుణని చూసిం తర్వాత, కామేశాన్ని మరింత దగ్గరగా పరిశీలించా లనిపించింది—అందమైన స్త్రీ భర్తకి పెళ్ళాం తాలూకు అందం కొంతంత పట్టుకుంటుం దన్నట్లు.

ఎత్తు నుదురు, ఎగదువ్విన మధ్యపాపిడి జుట్టూ, పెద్ద ముక్కూ, బలమైన గుండ్రటి పెదవులు, తీక్షణమైన ప్రాచీన మానవత్వాన్ని, పురుషత్వాన్ని సూచిస్తున్నాయి.

సుగుణ జబ్బు ఫలానా అని వైద్యులు నిర్ణయించలేక పోయ్యారుట. స్థలం మార్పు, విశ్రాంతి వుంటే, తేరుకుంటుందిట. దేన్నుంచి తేరుకోడం, అని అడగా లనిపించింది, ధైర్యం లేదు. కామేశం స్థితిపరుడన్న విషయం, నేను మరిచిపోలేదు. మనస్సు శరీరాన్ని కలవరపెడుతుంది; శరీరం మనస్సును చికాకుపరుస్తుంది.

ఆ రెంటి సమన్వయం పరిపూర్ణారోగ్యం. దానికి విశ్రాంతి, స్థలం మార్పు అవసరం. ఈ రెండూ డబ్బున్నవారికే సాధ్యపడతా ఆ విధంగా, నాకు నేను సమాధానం చెప్పుకున్నా.

సుగుణ స్నానం చేసి వొచ్చి, స్తంభానికి కాళ్లు ఆంచి కూర్చుంది. బోర్డర్ లేని తెల్లచీర. తెల్లవులెన్ మఫ్లర్ తలకి చుట్టుకుంది. చెట్ల ఆకుల మధ్యనుంచి ఎండ కిరణాలుగా నుదుటి మీదపడి, కనురెప్పల నీడల్ని, తీగలుగా బుగ్గలమీదికి జారుతున్న దృశ్యం—కిరణం ఆమెగా అంతమైనట్లు—నేనెప్పుడూ మరిచిపోను.

"తుదకి నా వ్యాధి ఏమని నిర్ణయించారో—" అంది సుగుణ.

"భాగ్యవంతులకి వొకటే వ్యాధి—అమితమైన తీరిక" అంటూ కామేశం లేచి, ఆవరణ తిరిగి, రకరకాల పువ్వులు కోసు కొచ్చి ఆమె కిచ్చాడు. అతివయ్యారంగా ఆమె వాటిని జడలో అమర్చుకుంటోంది—పువ్వుల్తో పూజించడమంటే అదే కాబోలును!

"చూశావా ఎంత అందమైన జబ్బో!" అన్నాడు కామేశం కాస్త హేళనగా. అతను నా వినోదం కోసం మాట్లాడుతున్నట్లు ఆమె గ్రహించినట్లు లేదు, కళ్ళు కోపంతో ఒక్కసారి ముడుచు కున్నాయి.

"కోపమా సుగుణా—ఆడాళ్ళకి హాస్యం, సరసం తెలీదు, లోపలి కెళ్ళి పడుకో, ఇక్కడ ఎండ" అని ఆమె చెయ్యి ఆప్యా యంగా పరిచి, లేవదీసి, గదిలోకి నడిచి వెళ్ళాడు. వారి అన్యో న్యానికి నా వొళ్ళు పులకరించింది. కళ్ళల్లోకి రానున్న తడిని, రుమా లుతో తుడిచి వేశాను. నిండైన అందమైన ప్రేమలో విషాదం వుంది కాబోలు. భార్యాభర్తలు కాకుండా వొక పురుషుడు వొక స్త్రీ ఐ వుండి అంత అన్యోన్యంగా వుంటే, అదొక శృంగార కావ్యం. వివాహం పూర్తికాని కావ్యంగా మారుస్తుంది ప్రేమని.

వెడతానని లేచాను. భోజనం చేసి, సాయంత్రం వెళ్ళమని బలవంతం చేశారు. నాకు ఘరోపని లేకపోతే, నర్సింగ్ హోములో మరో వారం వారితో వుండమన్నారు. సుగుణకి గుండె నీరసంట—

సంపూర్ణమైన విశ్రాంతి కోసం అక్కడ వుండటం. డాక్టర్ల ఆదేశం, నౌకర్లు, చాకర్లు వంటవాళ్ళు - దివాణంలా వుండే వారి కాపరంలో, ఆమె పడే శ్రమ ఏమిటో నాకు అర్థం కాలేదు. శరీర శ్రమ కాకుండా వేరే మానసికమైన శ్రమ లుంటాయి కాబోలు. ఆ శ్రమ మనోవ్యాధి కాదు, చిక్కులవల్ల ప్రాప్తించింది కాదు. పరిపూర్ణ తృప్తి నుండి జనించే వొక అసంతృప్తి కాబోలు. అమితానందంలోని వ్యాకులత; తన్మయత్వంలోని చైతన్యం; అప్రమత్తతలోని జిజ్ఞాస.

మధ్యాహ్నం కాలక్షేపానికి ఫోటో ఆల్బమ్ తీశాడు కామేశం. కుటుంబ వ్యక్తుల ఫొటోలు. బాల్యంలోవీ, వివాహ సందర్భంలో తీసినవి; హాస్టల్ ఫోటోలు, వాటిల్లో పాత స్నేహితులు. ఎవరెవరు, యిప్పుడు ఎక్కడెక్కడున్నది చెప్పుకుంటో గడిపాం.

"నా పెళ్ళికి నువ్వూ, కరుణాకరం తప్ప, యిందులో మొతా అంతా వొచ్చారు, తెలుసా" అన్నాడు కామేశం.

"నేను వొద్దా మనుకున్నాను. ఆ రోజుల్లోనే నాకు వుద్యోగం యింటర్వ్యూ ఒకటి తగులబడింది—కరుణాకరం ఎందుకు రాలేదు? ఎప్పుడూ నీతోతే వుండేవాడుగా. ఇప్పుడేం చేస్తున్నాడో."

"ఇప్పుడంత తరుచు రావడం లేదు, ఏదో న్యూస్ పేపరాఫీసులో పని చేస్తున్నాట్ట. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూంటాడు" అన్నాడు కామేశం.

"పోనీలే—తెలివిగలవాడైనందుకు, ఏదో ఉపాధి దొరికింది, పాపం...." అంటూ సానుభూతి ప్రకటించాను.

"మంచివాడు—ఇంక పెళ్ళి కావడం మిగిలింది" అన్నాడు కామేశం.

"మంచితనానికి పెళ్ళి తగిన శాస్తా ఏమిటి?" అని సుగుణ నవ్వింది.

నాకూ నవ్వొచ్చింది. కాసేపు ఆపుకున్నాడు కాని, కామేశం గూడా విరగబడి నవ్వేశాడు.

"ఆడాళ్ళకి హాస్యం, సరసం తెలీకపోవడం, వోవిధంగా మంచిదేనేమో—" అని యింకా నవ్వడం సాగించాడు.

ఇంతలో సుగుణ లేచి వచ్చి కామేశం చేతిలోని ఆల్బమ్ మూసేసి లాక్కుంది.

"ఎటేనా షికార్ పోదాం—ఇక్కడేం బావుండలేదు."

నర్స్ డాక్టర్‌గారితో చెప్పి బైటకు వెళ్ళడం మంచిదని సలహా యిచ్చింది. నేను, కామేశం వెళ్ళి డాక్టర్‌తో మాట్లాడి ఒప్పించాం అట్లా షికార్లు తిరిగితే, నర్సింగ్ హోం మెందుకని విసుక్కున్నా. డాక్టర్ లోకానుభవం కలవాడు.

ముగ్గురం కార్లో షికారు బైలుదేరాం. మధ్యలో దిగి "నే వెడతా"నని సెలవు తీసుకున్నా. సుగుణ కెట్లా వున్నదీ ఇంటి కెళ్ళం తర్వాత తెలియపరచమన్నాను.

"స్నేహితులందరికీ సానుభూతి తెలిపినందుకు థాంక్ చేస్తూ. కరుణాకరం పేపర్లో ప్రకటిస్తాలే" అన్నాడు కామేశం. ఇద్దరం నవ్వుకున్నాం.

కారు దూరంగా వెళ్ళింది. నేను దానికేసి చూస్తూ అలానే నిలబడ్డా. సుగుణ బహిరంగంగా. పదిమందిలోనూ వున్నప్పుడు తప్ప. తీక్షంగా జీవించలేదు. ఏకాంతం ఆమెకి తగ దనిపించింది. ఆమె తేరుకోనేటందు కుండవల్సింది నర్సింగ్ హోమ్‌లో కాదు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపైన.

ఇంతకీ నేను చెప్పదల్చుకున్నది కరుణాకరం గురించి. ఇంతగా కామేశం గురించి వ్రాయడానికి రెండు కారణా లున్నాయి. కొన్ని సంవత్సరాలు గడిచిం తర్వాత, స్నేహితులు కలుసుకున్నప్పుడు. వారి మనస్తత్వాల స్వరూపం విశదం చేసుకుందామన్నది మొదటిది; రెండోది. కామేశాన్ని. సుగుణనీ కలుసుకుని ఉండకపోతే. కరుణాకరం అంతరంగిక విషయాలలో నాకు పరిచయం. కొంత వరకూ జోక్యం. లభించకపోయే దన్నది.

నర్సింగ్ హోమ్ ఘట్టం జరిగిన ఒక ఏడాది తర్వాత. అనుకోకుండా. పట్నంలో మందులషాపులో కరుణాకరాన్ని కలుసుకున్నా. కంఠం మండుతుంటే త్రోట్ పిల్స్ కోసం షాప్‌లో కెళ్ళాను. కరుణాకరం నన్ను వెంటనే గుర్తుపట్టాడు-రెండు క్షణాల తర్వాతగాని.

ప్రతి మందహాసం చెయ్యలేక పోయ్యాను. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకంటూ నా రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకొని, సంతోషం వెలిబుచ్చాడు. మనిషి బాగా ఎత్తరిగా కనిపించాడు. చదువుకునే రోజుల్లో మాదిరిగా అంత సన్నంగా లేడు. జుట్టు, నుదుటిమీద మూలల్ని కాస్త పైకి జరిగింది. మధ్య పాపిడితీసి వెనక్కి దువ్వినా, కాడల్లాగ వెంట్రుకలు ముందుకి వొత్తుగా పడుతున్నాయి. చదరంగా, బలంగా కనబడింది మొహం ఎడం బుగ్గ కిందుగా మచ్చ. క్షవరం చేసుకోక పోవడం మూలాన కాబోలు, స్ఫుటంగా కనబడటంలేదు. నవ్వులో కొత్తదనం, అమాయకత్వంలోని స్వచ్ఛమైన సంతోషంవున్నా కళ్ళల్లో కలత కనిపించింది —మందులన్నీ సంచీలో పెట్టుకున్నాడు

"ఎవరు మందిస్తున్నారు? రోగివి నువ్వే రావాల్సి వొచ్చిందా మందుకి?" అనడిగాను.

కరుణాకరం నవ్వేశాడు. "నాకేం జబ్బు. నాక్కాదు. చెప్తా రా. కార్లో మాట్లాడుకుందాం."

థ్రోట్ పిల్స్ తీసుకున్నాను. అతని కో టిచ్చి నేనొకటి చప్పరిస్తూ బైట సిద్ధంగాఉన్న కార్లో ఎక్కాం. కరుణాకరం డ్రైవ్ చేస్తున్నాడు ఇతనికి కారెక్కడిదా అనుకుంటున్నా ఆకార్ని యిదివరకెక్కడో చూసిన జ్ఞాపకం. నా మనసులో భావాల్ని తెలుసుకున్న వాడిమాదిరి అతనే అన్నాడు.

"నాక్కా రెక్కడి దనుకుంటున్నావ్—అవునా' ఇది కామేశంది. అతనికి జబ్బుచేసింది - నీరసించి పొయ్యాడు. ఎక్స్‌రే డయాగ్నోసిస్ టీ. బి. అని తేల్చింది. మూడు నెల్లనుంచీ శానిటోరియమ్‌లో ఉంటున్నాడు. నే నొచ్చి నెలరోజులైంది. అతని కేమీ ప్రొద్దుపోక దిగులుగా ఉంటోందనీ, నన్నొచ్చి ఆదుకోవల్సిందనీ వ్రాశాడు. నిజంగా అతని అవసరానికి నే నుండకపోవడం అన్యాయంగా తోచింది."

కారు నిలిపి, యిప్పుడే వస్తా నుండమని షాప్‌లో కెళ్లాడు. అతను చెప్పిన వార్తల్ని అవగాహన చేసుకుంటున్నాను.

అతను చివర చేసిన వాఖ్యానంయొక్క అంతరార్థం నాకు

పూర్తిగా బోధపడినట్లులేదు. అయిష్టమైన త్యాగం చేస్తున్నట్లుంది. ఈ విషయం వదిలేసి, టి. బి గురించి ఆలోచన సాగించాను. చిత్రం! టి. బి. యవ్వనంలో ఉన్నవారినీ, భాగ్యవంతుల్నీ పట్టుకుంటుంది. ఆ క్రిములు దుమ్ములో ఉంటాయనీ, దాన్ని పీలిస్తే సంక్రమిస్తుందనీ అంటారు. కామేశానికి దుమ్ముపీల్చే కర్మమేం? అతనికి రోడ్డుమీద నడవవలసిన అగత్యమే లేదు. ఎప్పుడూ కార్లోనేకదా తిరిగేది. పోనీ, వంశ పారంపర్యంగా సంక్రమించే టి. బి. కి లొంగిపోయ్యే శారీరకదుగ్మత ఉందేమో అనుకుందామంటే, అతని కుటుంబంలో ఎవ్వరికీ టి. బి. చరిత్ర ఉన్నట్లులేదు.
అయితే సుగుణ జబ్బు ఎట్లా ఉంది?....

కరుణాకరం చక్కావొచ్చాడు. 'ఇంక తిన్నగా శానిటోరియమ్‌కే' అని కారు పోనిచ్చాడు. బ్యాగ్‌లో టొమాటోసాస్, బ్రెడ్, క్రీమ్ క్రాకర్స్—ఉన్నాయి. వాటివాటి ధరలు. అవీ మాట్లాడుకుంటున్నాం. ఇంతలో శానిటోరియమ్ కొచ్చేశాం.

క్షయరోగు లుండేందుకు పెద్దభవనం ఉంది. దానిచుట్టూ ప్రత్యేక సదుపాయాలు చేసుకునే రోగులకు, ఒక అరడజను చిన్న చిన్నవి రెండేసి గదులుగలవి—బంగ్లాలున్నాయి. చివరిదాంట్లో ఉంటున్నాడు కామేశం, కారు ఇక్కడ నిలవలేదు. రెండుమూడు ఫర్లాంగులదూరంలో, సంసారాలవా ళ్ళుండేందుకు వేరే యిళ్ళున్నాయి. ఆ ఆవరణాన్ని 'సంతోషి' కాలనీ అంటారుట. అక్కడ దిగాం. ఇద్దరు నౌకర్లు కార్లోసరుకు లోపలికి చేరేశారు. వంటాయన శంకరయ్య ఉన్నాడు. అమ్మగారు అప్పుడే శానిటోరియమ్ కెళ్ళారని చెప్పాడు. నాముందు పత్రికపడేసి, కరుణాకరం క్షురకర్మ ప్రారంభించాడు. శంకరయ్య కాస్త కాకో. బ్రెడ్ తీసుకొచ్చాడు.

"ఈపూట యిక్కడే భోజనం" అన్నాడు కరుణాకరం.

"మొన్న పత్రికలో నువ్వురాసిన 'అపరాధం' చదివాను. అప్పుడే నీకు ప్రొఫెషనల్ టచ్ వచ్చేసింది" అన్నాడు.

"అది మెచ్చుకోదగిందే వొస్తుందా?"

"చాలా [illegible], ఉద్రేకాన్ని స్వీయంపై కేంద్రీకరించ

కుండా. పరకీయం చెయ్యగలగు. సిద్ధహస్తుడి లక్షణం టాను. నా కంతటి డిసిప్లిన్ వుంటే ఎంత బాగుండును! ఊహలో కాకుండా, జీవితంలో శిక్షణ వుండాలి. ఊహలో అ వేదాంతులమే—"

కరుణాకరం స్వగతంగా చెప్పుకుపోతున్నాడు.

"ప్రస్తుతం ఏదేనా పత్రికకి పుస్తక సమీక్ష చేస్తున్నా అనడిగాను.

"పత్రికలకి వ్రాయడంతో భుక్తి గడవడంలేదు. ఏ ప లోనేనా జేరదామంటే. పత్రికలన్నీ రాజకీయాలకి ముడెట్టుకు కూ న్నాయి. ఏ రాజకీయవాదం సమ్మతం కానప్పుడు. కొడిగడితేగాని, భుక్తి గడవదనుకో. అంచేత విడిగానే సంప్ర యంపై వ్యాసాలూ, నువ్వు అనుకున్నట్లు సమీక్షలూ వ్రా రోజులు వెళ్ళబుచ్చుతున్నాను. సమయానికి, కామేశం ఆదుకుంటూ వున్నాడు."

క్షురకర్మ ముగిసింది; బుగ్గకింద మచ్చ. పచ్చగా మెరి గడ్డంలోంచి నీలంగా, మొహాన్ని వెలిగించింది. కరుణాకరం కళ్ళ దైన్యం వుంది—కాని పెదవులు నవ్వడానికి సిద్ధంగా వున్నట్లుం డం చూస్తే అది తెచ్చిపెట్టుకున్నదేమో ననిపించింది. యవ్వనం వెళ్ళిపోయేటప్పుడు, అవయవాలకి, పరిపూర్ణతనీ. కొంచెం కరు తనాన్ని యిస్తుంది కాబోలు. ఆ రెండూ అతనిలో వున్నాయి.

అతను స్నానానికెళ్ళాడు. బల్లమీద సుగుణ, కామేశం తీయిం కున్న ఫొటోవుంది. దానికింద, ఆగష్టు 15, 1947, అని వుంది— సుగుణ, ఫొటోలోకంటె, బైటనే చూడ్డానికి బాగుంటుంది. చర్మంలో మెత్తదనాన్ని: నుదుటిమీదా, చెక్కిళ్ళమీదా, జ్వాలలా కదిలే రక్త నీడల్ని ఫొటో ప్రదర్శించలేదు.

కామేశాన్ని చూడ్డాని కెళ్ళాలంటే భయమేసింది. క్షయవ్యాధి గురించి బోలెడు గాథ లున్నాయి. దాని దశలు.—ప్రారంభం, ఔన్నత్యం. పరిమితి, పతనం—వొక ప్రాచీనయుగం నాగరిక చరిత్రలాంటిది. దానికి యవ్వనంపైననే మోజు—దానికి శారీర

భవం, కామం, ఆకలి, శృంగారం, వినోదం, సంతోషం, సంపద రావాలి. ప్రేమలా అది గుడ్డిది. వివక్షతలేకుండా మూర్ఖంగా వ్యక్తిని కామిస్తుంది. ప్రేమలాగే ప్రాణాన్ని త్యాగంగా కోరుతుంది. అనుభవంతో తీక్షత తగ్గినట్లు వుండిపోతుంది. పోయినట్టుపోయి వొచ్చి వుంటుంది. మనిషిలో రహస్యమందిరాలని కూకటి వేళ్ళతో, జీవం ఆదిలో వేసిన పునాదుల్ని సహితం పెల్లగించి, ప్రతి అణువునూ తరచిచూసి, ఆవరించి, జీర్ణించుకుని, పీడించి చంపేస్తుంది. దానిష్టం-వొక్కొక్కప్పుడు-"పో అబ్బాడా—నువ్వు నాకు తగవు!" అన్నట్లుగా, మహాశక్తిలాగా, చెలగాటంతో కవ్వించి వెక్కిరించి వెన్నుమీద తాపుతన్ని, అధోలోకంలోకి అస్థిపంజరాన్ని గిరవాటెట్టి వెళ్ళిపోయి, మరి రాదు. టి. బి. శృంగార కావ్యం; పురుషుడు దాని ఆటవస్తువు. చావుబ్రతుకులు సంతానం.

అతను స్నానంచేసి వొచ్చి నన్ను స్నానాని కెళ్ళమని తువ్వాలు, సోపు తెచ్చాడు. స్నానంచేసి వొచ్చాను. పైజమా, లాల్చీ, పైన తువ్వాలు వేసుకుని, బైటికి నడిచాం.

కామేశం పడక్కుర్చీలో కూర్చుని ఉన్నాడు. సుగుణ వెనకాల స్టూల్‌మీద కూర్చుని, రుమాలుకి ఉడుకులాం రాచి అతని నుదుటిమీద తుడుస్తోంది. కేన్‌సోఫా ముందుకు లాగి మమ్మల్ని కూర్చోమంది. కరుణాకరం టెంపరేచర్ చార్టు చూస్తున్నాడు.

నన్ను చూడగానే, కామేశం లేచి, నా రెండుచేతులూ పట్టుకుని అటూ ఇటూ నాతో పచార్లుచేస్తూ, కుశలప్రశ్నలు వేశాడు. అతని వ్యాధి లక్షణాలు చెప్పాడు. సాయంత్రం వొక గంటసేపు మాత్రం, టెంపరేచర్, రెండు డిగ్రీలు హెచ్చుగా వొస్తూందిట. ఒక లంగ్ కొద్దిగా చెడిందిట. డాక్టర్లు చాలా ధైర్యంగా చెబుతున్నారట.

"నాకీ విషయం ఎందుకు తెలియపరచలేదు?" అనడిగాను.

"నేనేం విఖ్యాత పురుషుణ్ణా? రాజకీయవేత్తనిగాను—సినీమా స్టార్‌నీ కాను. నలభై లక్షల టి. బి. పేషంట్లలో నేనొకణ్ణి" అని నిరసంగా నవ్వాడు కామేశం. మొహంలో కళ పల్చబడింది.

చర్మం మెదడుని అంటిపెట్టుకున్నట్లయింది—ముఖ్యంగా కంఠ
దగ్గర. గొయ్యిలా. చర్మం సాగి, అదరడం కనిపిస్తోంది. కళ్ళు
కూడా లోతుకిపోయినాయి, ఎప్పుడోగాని, దగ్గు రావడంలేదు. వేళ్ళు
సన్నగా, పొడుగ్గా, కర్రపలకలో గందరించి తయారుచేసినట్లుగా,
ఏదో పట్టుకోసం పెనుగులాడుతున్నట్లు, క్రౌర్యంతో వొంపులు తిరిగి
నాయి. నేను సానుభూతి ప్రకటించాను.

"ఎల్లా పరామర్శించాలో, బాగా రిహార్సల్ చేసుకొచ్చినట్లు
న్నావు పాపం. పెదవులు చప్పరించే స్థితికింకా నేను రాలేదులే—
నిజంగా యిప్పుడే నాకెంతో ఆనందంగా వుంది. కుదిరిపోయింది
పొమ్మంటారేమో డాక్టర్లు అని భయంగా వుంది" అన్నాడు. నాకు
నవ్వొచ్చింది.

"శంకరయ్య భోజనం తెచ్చాడు. లేవండి" అంది సుగుణ.

"సుగుణ మాట తప్పించివేస్తోంది. వెనక జ్ఞాపకం వుందా,
సుగుణది అందమైన జబ్బన్నాను—ఇప్పుడు నాది. సంతోషకరమైన
జబ్బు—అంతే తేడా." అంటూ భోజనానికి లేచాడు.

పక్క సర్దడం, దుస్తుల అమరిక, గది అలంకారం—
సుగుణ భర్తకి ఉపచారం, ఒక కళగా సాధించిందనాలి.

"ఇప్పుడు మీ వొంట్లో కులాసాగా వుంటోందా?" అ
అడిగాను సుగుణని. ఈ సందర్భాలకి అలవాటు కానప్పుడు, సంభాషణ
అంత సరసంగా నడవదు.

"ఇప్పుడంటే?" అన్నాడు కామేశం.

"వెనక ఆయన నన్ను నర్సింగ్ హోమ్‌లో చూసినప్పటి
కంటె—అని భావం—నే నెట్లా కనిపిస్తున్నాను?" అన్న
సుగుణ.

ఈసారికూడా ఏమనాలో తెలీక, అర్థంలేకుండా నవ్వేశాను.
అది మరీ ప్రమాదించింది.

"నన్ను రాత్రి పగలూ కనిపెట్టుకుని, నాకు చాకిరీచెయ్యడం
వల్ల చిక్కిపోయిందనుకుంటున్నావా?"

"లేదు. లేదు—అయిష్టంగాచేసిన చాకిరీవల్ల చిక్కిపోవచ్చు

ఆప్యాయతతో చేసిన పని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది" అన్నాను.

"అవుతే యిప్పుడు నేను లావెక్కానంటారా ఏమిటి?" అని సుగుణ నవ్వింది.

"రోగిని కనిపెట్టుకున్న వాళ్ళుకూడా నీరసంగా, బలహీనంగా కనబడటం సహజం. కరుణాకరం లేకపోతే, నాపని ఏమైయుండేదో! నిజంగా అతని ఋణం తీర్చుకోలేం. రమ్మని వ్రాయడంతోటే చక్కావొచ్చాడు. సుగుణకి ధైర్యం చెబుతూ రాత్రి పగలు నన్ను కనిపెట్టుకుని తిరుగుతో అతను చేస్తున్న సేవ అపారం. నాకు తగ్గి యిక్కడనుండి విడుదల కాగానే ఓ నెలపాటు ఏ వూటీయో పోయి, అతనికి రెస్టు యివ్వాలి" అన్నాడు కామేశం.

ఇంతలోకే కరుణాకరం డాక్టర్‌తో మాట్లాడివచ్చాడు. సుగుణతో ఇన్‌జెక్షన్ విషయం ఏదో మాట్లాడాడు. మేంవెళ్ళి భోజనంచేసి కాసేపు విశ్రమించి మళ్ళా సాయంత్రానికి రావడానికి స్థిరపరుచుకుని ముగ్గురం బైలుదేరాం.

నడుస్తూన్నప్పుడు, సుగుణ ఎంత అందమైందో నేను గుర్తించగలిగాను—వొయ్యారంగా ఉండటమేకాదు—కొంత కీవి 'పోయిజ్' కూడా ఉన్నాయి, మిలిటిరీ ఉద్యోగుల్లోతప్ప మొగాళ్ళల్లో 'పోయిజ్'—నేను చూళ్ళేదు, ఆరకం నిబ్బరం. హుందాతనం 'ధీమా'— వ్యక్తిత్వం—వీటి సమ్మేళనంవల్ల పక్వానికొచ్చిన శరీరలావణ్యం సుగుణది.

భోజనాలైం తర్వాత, నా కాలక్షేపానికి. కామేశం జబ్బు వివరాలు వాళ్ళిద్దరూ చెప్పారు. అక్కడ యితరరోగుల మనస్తత్వాలు, డాక్టర్ల అభిప్రాయభేదాలు, నర్సుల యీర్ష్యలు.ప్రాణం కోసం, సంఘం పెనుగులాడుతున్న గాధ, అదంతా ఎవరు నెగ్గుతారో ఎవరు ఓడిపోతారో, నిర్ణయించలేరు.

"మేం, రాత్రుళ్లు అక్కడ పడుకోటానికి డాక్టర్ల అభ్యంతరం లేదు. కాని కామేశం పీల్లేదంటాడు. దూరంగా వుండి, తగు జాగ్రత్త తీసుకోకపోతే, టి. బి మాకూ్కడా సంక్రమిస్తుందట— అది జరిగితే, అతన్ని చూసేవాళ్లెవరూ వుండరుట— ఇట్లా

మాట్లాడతాడు. పాపం కామేశం....ఏమిటి చెయ్యడం?" అన్నాడు కరుణాకరం.

"అతను చెప్పింది నాకు సబబుగానే వుంది" అన్నాను. ఎన్నెన్నో సంసారాలు అజాగ్రత్తవల్ల టి. బి. కి గురవడం జనం చెప్పుకుంటూ వుంటారు. కావల్సినవాళ్ళు ఆదుర్దాపడి, దగ్గర వుండి గోరడం సహజం. ఇది నిజంగా, పెద్ద సమస్యే. పరిష్కారం వ్యక్తుల సంస్కారంపై వుంది గాని, రూల్సు, రెగ్యులేషన్సు, ప్రభుత్వ నిర్ణయం,- యివేవీ లాభంలేదు.

"నెలరోజులు ఓపికపడితే, కామేశాన్ని హాస్పిటల్ నుంచి విడుదల చేస్తారు. చాలా ఎర్లీస్టేజ్ లో వ్యాధి దొరికిపోయింది.... అదొక సుగుణం" అంటున్నాడు కరుణాకరం. నాకు నిద్రపట్టే సింది. సాయంత్రం టీ తాగింతర్వాత, అందరం స్నానాలుచేసి శానిటోరియంకేసి బయలుదేరాం.

కామేశం వ్యాధి పూర్తిగా కుదిరిపోయింతర్వాత, అతను ఏమేం చెయ్యదల్చుకున్నాడో చెప్పడం సాగించాడు. ఆ ప్రస్తావన అతని కెంతో సంతోషాన్నిస్తున్నట్లనిపించింది. టానిక్స్, ఫ్రూట్స్ ఏవేం తింటాడో. ఎంత వైట్ పెరుగుతుందో ఏఏ వూళ్ళల్లో, ఎన్నెన్ని రోజు లుంటాడో,—ఒక ప్రణాళిక తయారుచేశాడు. శంకరయ్యకి బట్టలు, గడియారం, కొనిస్తానన్నాడు. కరుణాకరంకి, ఎన్ సైక్లోపీడియా బ్రిటానికా బహుమానం చేస్తానన్నాడు. బొంబాయి వెళ్ళి సుగుణకి పెరల్ నెక్ లెస్ కొనా లన్నాడు. కాగితంపై యీ వూళ్ళ మార్గాలు పటంగా గీసి చూపించాడు. ఖర్చుల జాబితా తయారుచేశాం,

"మరి నీ కేమివ్వను?"

"నా కెందుకూ యివ్వడం? నేనేం చేశాను?" అన్నాను,

నన్ను చూడ్డాని కొచ్చావు పాపం. చిరకాల స్నేహితుడవు. సంతోషాన్ని వెలిబుచ్చుతూ నీకూ యివ్వాలి—ఏం కావాలి చెప్పు" అని అడిగాడు. అతని ఆప్యాయం. ఆపేక్ష, ఆదరణ నన్ను

కరిగించింది. అతన్ని కౌగలించుకుని, బుజంపై తల ఆనించి ఏడవాలనిపించింది. డబ్బులో అంత మహత్తుంది.

చెప్పు అని రెట్టించాడు కామేశం. నాకు వెయ్యి కోర్కెలున్నాయి. ఏమీ తోచనప్పుడు నా దగ్గర కావల్సినంత డబ్బుంటే. ఏవేం కొందునో వూహించుగుంటూ గంటలు గంటలు కాలం గడపగలను. కాని. ఆ సమయంలో ఫలానా వస్తువు కావాలని నిర్ధారణ చెయ్యలేకపోయాను. రోలెక్స రిస్ట్ వాచ్‌ని యీ మధ్య చాలా ఎడ్వర్‌టైజ్ చేస్తున్నారు, కాని. వంటాయన శంకరయ్యకి కూడా గడియారం యిస్తున్నా డనగానే దానిమీద మోజు తగ్గింది. పుస్తకాలు! ఎన్నని అడగను! ఏవనడగను? ఎన్‌సైక్లోపీడియా కరుణాకరం తీసుకుంటున్నాడు. కలం? వుండనే వుంది. బంగళా కట్టించిమ్మని అడగనా? అంత ఖరీదైన బహుమానం అడగటం భావ్యమా మరి—ఎంత ధనికుడైనా! మోటార్ కారుకూడా. ఖరీదైన బహుమానమే. బోన్‌చైనా (స్పెయిన్‌లో తయారైంది) టీ సెట్టు అడుగుదామన్న నిశ్చయానికి రాబోతున్నా— ఆ సమయంలో. అలమార్లోంచి తీస్తుండగా సుగుణ చేతుల్లోంచి పోర్సిలేన్ టీ కప్పు ట్రే సైతం కిందపడి. పగిలి. సంగీతంపాడి. నృత్యం చేసింది. అంత అశాశ్వతమైన వస్తువును బహుమానం కోరడం దేని కనిపించింది. బహుమానమే వొద్దనుకున్నాను.

"నేను నీకు చేసింది ఏమీ లేదు. ఇక్కడి కొచ్చింది వేరే పనిమీద. రెండు రోజులపాటు కూడా ఉండటం లేదు. రేపే వెడదామనుకుంటున్నా," అన్నాను.

"ఈ మధ్య కరుణాకరం యీ బెదిరింపే మొదలుపెట్టాడు." అంది సుగుణ.

"నా విషయంలో బెదిరింపులేదు. నా కిక్కడ బాగుండక కాదుసుమా. రేవో. మాపో. ఎవరివృత్తి వాళ్ళు చూసుకోవటం తప్పదుగా" అన్నాను.

"అవుతే. ప్రెజెంట్ తీసుకోనట్లే?" అన్నాడు కామేశం.

"రేపు వెడితే వెడుదువుగాని, ఏం ప్రెజెంట్ యిష్టమో చెప్పొచ్చుగా."

"ఏదిబడితే అది యిస్తా రేమిటి?" అని అడిగింది సుగుణ.

"ఓ"

"అవుతే వారికి భార్యకావాలట."

"ఎవరి భార్యట?"

అందరం బిగ్గరగా నవ్వేశాం.

"భార్యకాదు, పోనీ పెళ్ళాం" అంది సుగుణ. కామేశం నవ్వు ఆపుకోలేకపోతున్నాడు. మంచంమీద లేచి కూర్చుని, నవ్వుని దిగమింగడంలో, అది దగ్గులోకి దింపేసింది. కళ్ళు ఎర్రబడి పోయాయి. ఆయాసం ఎక్కువైంది. కెరటం పై కెరటం ఎగబ్రాకి నట్లుగా, దగ్గుతెరలకింద అతన్ని పీడించి, దిండ్లమీద వెల్లకిలా గిరవాటేసింది. ముగ్గురం అతని దగ్గరగా వెళ్ళి వాళ్ళంతా సర్దు తున్నాం.

"దగ్గరగా ఉండకండి— వెళ్ళండి- దూరంగా-వొద్దు, నే నిల్లాగే చచ్చిపోతాను కాబోలు" అన్నాడు. నా గుండెలు చిపుక్కు మన్నాయి, సుగుణం నవ్వుతూ, అతని నుదుటిని తుడిచి- నాకేసి చూపి, కళ్ళు చిట్లించింది.

"ఆయన రేపు వెళ్ళరు, మరో రెండురోజులపాటు ఉంటా రైలెండి" అంది.

కామేశం కొంచెం తేరుకున్నాడు.

"ఇల్లా మిదిమీదికి రావొద్దంటే, వినదు. ఎట్లా! దాని కేమన్నా వొస్తే, చూసేదెవరు?-మనం కూడా సంస్కారం లేని వాళ్ళల్లే ప్రవర్తిస్తే ఎల్లా?...." అని గొణుగుతున్నాడు.

చీకటిపడుతోంది. అట్లా తిరిగొస్తామనిచెప్పి, నేనూ కరు ణాకరం నడుచుకుంటూ పొయ్యాం. ఐదురోజుల చందమామ, చెట్లమీద మందహాసంచేసింది. మాట్లాడకుండా, నాలుగైదు ఫర్లాంగులు నడిచివెళ్ళాం. చిన్న రాతిబండలు పడివున్నాయి. వాటిమీద కూర్చున్నాం.

"నాకో సమస్యొచ్చి పడింది—నీతో చెప్పేస్తున్నా. నాకు సలహా యివ్వాలి." అన్నాడు కరుణాకరం.

"సలహా మాటెల్లావున్నా, తప్పకుండా వింటాను." అన్నాను. ఇతరుల స్వంతవ్యవహారాలు, అంతరంగికాలు వినడం ఇది మొదటిసారికాదు. నాకు లోకానుభవం తక్కువ. నాబంధుకోటి అసలు లేదంటారు. కాని తమ స్వంత గాథలు చెప్పుకున్నవాళ్ళు అడిగేది నిజంగా సలహా కాదు; సానుభూతి, లోకజ్ఞానం వున్నవాళ్ళు అడ్డదిడ్డమైన ప్రశ్నలు అడుగుతారు. విమర్శిస్తారు. విలువలు కడతారు- తీర్పు చెబుతారు. ఇవన్నీ సలహాకిం దొస్తాయి స్థూలంగా నే నది చెయ్యను. ఏ వొకరి పరిస్థితులూ మరి వొకరికి పూర్తిగా సంక్రమించవనీ, అందుచేత అవగాహన కావనీ, ఏ వొక్కరూ మరివొకర్ని విమర్శించే హక్కుగాని, అవసరంగాని లేదనీ, నా గట్టి నమ్మకం. ఇతరులను విమర్శించేవాళ్ళు తాము మంచివాళ్ళనీ, ఆ పరిస్థితుల్లో తాము అలా చేసి వుండమనీ సూచించడంలో తమ ఆధిక్యాన్ని రుజువు చేసుకుంటున్నా రని నా అనుమానం. ఈ సూత్రాన్ని నేను అంగీకరించలేను, కేవలం మంచివాళ్ళు. కేవలం చెడ్డవాళ్ళు వుండటం అసహజం. ప్రతివారిలోనూ కాస్త మంచి, కాస్త చెడ్డ కలిసుంటాయి. ఆయా పరిస్థితులనుబట్టే ఆయా శక్తులూ, వాంఛలూ బైట పడుతుంటాయి. చాలా భాగం మంచిగా చెలామణి అవుతున్నది. దొరికిపోని చెడ్డతనం అంటే అతిశయోక్తి కావొచ్చు కాని సత్యదూరం కాదు, మూర్ఖత్వం. అజ్ఞానం—యివన్నీ కూడా నీతిపరుల తీవ్ర విమర్శలకి గురవుతున్నాయి. మనుషుల మూర్ఖత్వానికి మనం కోపగించుకోడాని కలవాటుపడితే, జీవితం అంతా కనుబొమ్మలు ఎగరేస్తూ, ముక్కు కోణాలు కదుపుతూ కూర్చోవల్సిందే.

నాకు ప్రపంచ జ్ఞానం లేకపోవడమే యితరులు తమ విషయాలను చెప్పడానికి కారణం అనుకుంటాను. ఎవ్వరూ తమ విషయం పూర్తిగా, అంతా నిజం చెప్పరని నా అనుభవం. చెబితే, అవి నమ్మలేం కదా. అవన్నీ నిజమని నమ్మితే, మానవజాతిపై అభిమానం, ఆశ నశిస్తాయి. ఎక్కువ కుతూహలం కనపరచకపోవటం

మంచిది. కరుణాకరం చెప్పదల్చుకున్న విషయం వినాలని చాలా కుతూహలంగా వున్నా. అది అంతగా బైటికి కనపర్చలేదు. సామ తిలో కూడా విమర్శలో లాగానే కొంత లౌక్యం అవసరం.

"నువ్వు వూహించగలవా?"

"నేనా—ఊహించగల్ను! ఊహించటం కష్టంగాదు; సరిగ్గా ఊహించడం కష్టం." అన్నాను.

"సుగుణ నన్ను ప్రేమిస్తోంది. ఇంకా ముదరక ముందే, నే నిక్కడ నుంచి వెళ్ళిపోవాలి. కామేశం వుండమంటున్నాడు. అదీ నా సమస్య" అని మౌనంలో పడ్డాడు, కరుణాకరం.

నే నేమీ వ్యాఖ్యానం చెయ్యలేదు. ఎన్నెన్నో దృశ్యాలు, భావాలు, ఘట్టాలు మెదడులో మెరుస్తున్నాయి. వాటిని సర్ది, సమన్వయ పరుస్తున్నా. సుగుణ వెన్నెట్లోంచి. మిట్ట మధ్యాహ్నం ఎండలో కొచ్చినట్లు స్ఫుటంగా కనబడుతోంది. సుగుణ వుండవల్సింది ప్లాట్‌ఫారమ్ గాని, నర్సింగ్‌హోమ్ కాదని, యిదివరలో నేను అనుకున్నట్లు వ్రాశాను కూడా. ఆమెలో ప్రచండ శక్తులు, సముద్రం లోతుల్ని కదిల్చే యింద్రియాల తీవ్రత, సృష్టిని వెదుకుతూ, భూమి అడుగు భాగంలో కదిలిపొయ్యే భూకంపం, పరవళ్ళలాగా. ఎక్కడో, ఎప్పుడో ప్రజ్వరిల్లక మానవు, భూకంపం పరవళ్ళు, ఎక్కడో భూమిని చీల్చుకొని బైట పడతాయి, కరుణాకరం కాళ్ళ కింద భూమి చీలింది. అందులో అతను పడ్డాడా?

"నువ్వామెను ప్రేమించావా?" అని అడిగాను.

అతను వెంటనే సమాధానం చెప్పలేదు. రెండు మూడు నిమిషాలైన తర్వాత, మాట్లాడ్డం మొదలెట్టాడు. "అంతా చిత్రంగా వుంటుంది. దానికి తుది మొదలు లేదు. ప్రారంభించిం దెవరో కూడా చెప్పలేను. నే వొచ్చిన రెండు రోజులకి కారు రిపేరింగ్ కెళ్ళింది. నేనూ, శంకరయ్యా. సుగుణ జట్కాబండి చేసుకొని భూర్కో వెళ్ళి వస్తున్నాము, నేను చివరగా కూర్చున్నాను. చీకటి పడింది, నా కుడిచేతి మీద. ఆమె చెయ్యి పడింది. వెనక్కి లాగి, ఆ చేతి వెంపుకి తిప్పాను, ఆమె చేతివేళ్ళు నా వేళ్ళను వెదికాయి.

ఎవరి వేళ్ళు వొంకర తిరిగి బిగించాయో, నాకిప్పటికీ జ్ఞాపకం రాదు. రెండు మూడు క్షణాలవగానే చేతిని ముందుకు జరిపి, పాదంపై ఆనించి పట్టుకున్నాను. ఆమె చెయ్యి కూడా తీసేసింది. బండి గోతుల్లో పడుతూ మెల్లగా నడుస్తోంది. లోపల ఎగిరెగిరి పడు తున్నాం. ఆ కదలికలో, మళ్ళా ఎల్లాగో మా రెండు చేతుల కలుసుకుని, వేళ్ళు ముడి పడ్డాయి. ఆ అనుభవం నే నెప్పుడూ మర్చి పోలేను. కొండ శిఖరం మీదనుంచి జారిపడిపోబోతుంటే. పడకుండా. గట్టిగా పట్టుకున్న స్పర్శ అది. బండి పెద్ద గాడిలో పడింది. ఆమె కుడిచెయ్యి. నా బుజం మీద గట్టిగా అదిమింధి. నేను బండిలోంచి పడిపోతానేమో అన్నట్లు గట్టిగా నన్ను ముందుకి లాక్కుంది. బండి నిల్చి. మేం దిగేవరకూ నే నెందులోనో పడి కొట్టుకుపోతున్న ట్లని పించింది. మొన్నాడు ఆమెకేసి చూడలేకపోయ్యాను. ఇంటికే రాలేదు, శానిటోరియమ్‌లో, కామేశం గదిలోనే గడిపాను.

నే నేమనాలో, ఏం చెయ్యాలో తెల్సింది కాదు. ఇంటి కొచ్చి నప్పుడు ఆమెతో ఏకాంతంగా వుండకూడ దనుకున్నాను. రాత్రిళ్ళ నేను శానిటోరియమ్‌లో కామేశంతోపాటు వరండాలో పడుకోవా లంటే, అతను వొప్పుకోలేదు, సుగుణ మనస్సుకి నొప్పి కలగ కుండా, ఆమెనుండి దూరంగా తొలగిపోవటం సాధ్యపడలేదు ఒక రాత్రి. అంతా పడుకున్న తర్వాత నాకు నిద్ర పట్టక, దూరంగా వెళ్ళి చెట్టుకింద, ఆకాశంకేసి చూస్తూ కూర్చున్నాను. నాకు జీవితమంటే భయమెయ్యసాగింది. సుగుణ ప్రతిమ నీడలా నన్ను వెంటాడింది. మాట్లాడకుండా నాకేసి చూడకుండా, సుగుణ నా వునికిని ఆక్రమిం చేసింది. నా ప్రపంచం చుట్టూ గీట్లు గీసేసింది, నే నా వాతావరణం అతిక్రమించలేను."

'నాకూ నిద్ర పట్టడం లేదు'

వెనక్కి తిరిగాను, సుగుణ! తెల్లచీర—కొంగు జడ మీద కప్పుకుంది. నల్లజాకెట్టు సిల్కు వెన్నెట్లో నీలంగా మెరిసింది. అలా కూర్చుంది.

"ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?"

'ఏమీ లేదు.'

'ఆయన జబ్బు విషయమా?'

'జబ్బు విషయం దిగులుపడ నక్కర్లేదు. డాక్టర్లు రెండు నెలల్లో నయమవుతుం దంటున్నారు.'

'మరింక దిగులు దేనికి?'

'నా కేమీ దిగుల్లేదు—నువ్వు ధైర్యంగా వుండటం కూడా. నా ఉత్సాహానికి కారణమే.'

'ఉండక చేసేదేముంది? ప్రమాదకరమైన వ్యాధి. సర్వ యత్నాలు చేస్తాం, ధైర్యంగా వుంటాం, పారిపోయి దిగులుతో కుళ్ళిపోతే ఏం ప్రయోజనం?' అన్నది సుగుణ.

'నిజంగా పురుషులకంటె. స్త్రీలకే మనోనిబ్బరం. ధైర్యం ఎక్కు వనుకుంటా.'

'అల్లా అనడంలో కూడా, పురుషులు తమ ఆధిక్యాన్ని చూపించడమే నంటాను' అని నవ్వింది. 'కోపమా?'

'లేదు లేదు. నా కెందుకు కోపం?'

'సరే. దిగులు కాదు; కోపం కాదు. మరిం కేమిటో?'

'పొద్దోయింది. వెళ్ళి పడుకోరాదూ? మంచు పడుతోంది.'

'నీ ఆరోగ్యం కూడా ముఖ్యమే. నువ్వు లేకుంటే నే నే మయ్యేదానో?'

'నేను చేసిందే ముంది?'

'అవసరాని కొచ్చి ఆదుకోవడమే.'

'నే నో నాలుగు రోజులపాటు వున్నంత మాత్రాన మీ కష్టాలు గట్టెక్కుతయ్యా?'

'అప్పుడే వెళ్ళిపోవాలని చూస్తున్నట్లున్నావు?'

నేనేమీ మాట్లాడలేదు.

'ఏం?'

'సుగుణా—నువ్వేమీ అనుకోకూడదు, దీర్ఘవ్యాధి. నిదానం మీద తగ్గే సూచన లున్నాయి. నే నింక వెళ్ళకపోవటం భావ్య

మంటావా? ఏదేనా అవసరం వుంటే. కబురంపితే. ఎల్లానూ వొస్తాను.'

'ఇక్కడ నీకు కష్టంగా వుందా?'

'కష్ట మేమీ లేదు. మనం యిల్లా యిల్లా.... వుండటం....'

'ఎల్లా?'

'అదే—యిల్లా....ఎల్లా చెప్పాలో తెలీడం లేదు.'

'అట్లాగే వెడుదువుగాని.'

లేచి లోపల కెళ్ళింది. నేనూ వెనకాలే వెళ్ళి కాంప్ కాట్ చూరు కిందికి లాక్కుని పడుకున్నాను. తెల్లారగట్ల నాలుగింటికి కాని నిద్రపట్టలేదు, సుగుణ నొచ్చుకుంది. ఆ విషయం నన్ను మొన్నాడు. నాలుగైదుసార్లు. ఎగతాళిగా అంది. భర్తతో చెప్పినట్లుంది. అతనూ నన్ను ఎగతాళిగా, ప్రయాణం కట్టమనడం సాగించాడు. వె. వ్య. అని నామకరణం చేశాడు. వెడతానన్న వ్యక్తిట!

తరవాత నుంచి, సుగుణ, యితరుల ముందు కూడా, నాతో నిర్భయంగా స్వేచ్ఛగా మాట్లాడేస్తోంది. నన్ను వేళాకోళం చేసేంతటి చనువు కనబరచసాగింది. కామేశం ముందు కూడా; యీ చనువు దాచడానికి ఆమె యత్నమే చెయ్యలేదు. కామేశం ఏమనుకుంటు న్నాడో నే నూహించలేను. అతను లోతు గలవాడు. ఎంత లోతో తొంగి చూసే అవకాశం—తుదకి భార్యకి కూడా యివ్వడని నాకు తోచింది.

ఒక సాయంత్రం బజారునుంచి వస్తుంటే. పువ్వులు పట్టుకు రమ్మంది. నేను తీసుకు రాలేదు.

'పువ్వులు తేలేదేం?'

'మరిచి పొయ్యాను.'

'నాకు తెలుసు, నువ్వు మరిచిపోతావని. అందుకనే వేరే తెప్పించుకున్నాను.'

'కోప మొచ్చిందా?'

'తేనందుకు కాదు. మరిచిపోయినందుకు.'

దూరంగా వెళ్ళి, వెనక్కి తిరిగి అర్థమైనట్లుగా చూసింది.

చీర మార్చి, తల్లో పూలెట్టుకు 'రా వెడదాం' అంది. ఇద్దరం. హాస్పిటల్ కేసి నడు[illegible]న్నాం. కామేశం భోజనం చేసేవరకూ కూ[illegible]న్నాం [illegible] చూశాను. తల్లో పూలు లేవు. ఆశ్చర్యం వేసిం[illegible]ర్త ఖందు తీసేసింది. ఎందుకు? భర్త ఏమీ అనుకో కుండా. [illegible]ళ్లో నా కోపం చూసిందనుకుంటా.

'చూశారా—కరుణాకరం ఎంత చిత్రమైన మనిషో! కబుర్లు, [illegible]ం విప్లవంగా, అధునికంగా కనబడినా, ఆచార వ్యవహారాల్లో [illegible]వ్వకాలంమనిషే—మీకు జబ్బుగా వుంటే. నే పూ లెట్టుకో [illegible]దుట' అంటూ నవ్వింది. సాహసానికి చకితుణ్ణయ్యాను.

'భలేవాడే. పైగా నాకు జబ్బని ప్రచార మొకటా! హాయిగా ఎంజాయ్ చేస్తుంటే—'

అని కామేశం కూడా చిరునవ్వు సాగించాడు. కామేశం పక్కనిండా. యుడికొలోన్ చల్లింది. గులాబీ పూరేకలు. పరిచింది.

"అమ్మయ్య! ప్రాణం లేచొచ్చింది" అని కామేశం పరున్నాడు.

రాత్రి తొమ్మి దవొస్తోంది. ఇద్దరం మళ్ళా యింటికేసి బైలు దేరాం. వెనకాల శంకరయ్య టిఫిన్ కారియరూ, ప్లాస్కూ తీసు కొస్తున్నాడు.

"పూలవిషయం కోపమొచ్చిందా?"

"లేదు"

"ఒచ్చింది; నాకు తెలుసు, నాకూ వారికీ రహస్యాలు లేవు. భర్త మంచివాడు కానప్పుడు, భార్య రహస్యంగా వుంటుంది."

ఇవన్నీ శంకరయ్య వింటున్నా డని తోచింది.

"ఇప్పు డవన్నీ దేనికి?"

"శంకరయ్యకి వినబడుతుందనా?" నవ్వింది.

సుగుణ నిజంగా నా కర్థం కాలేదు. కామేశం ఎంతవరకు అర్థం చేసుకున్నాడో తెలీదు.

ఇల్లు చేరుకున్నాం. శంకరయ్య లోపలి కెళ్ళి వడ్డ నవుతోంది

రమ్మన్నాడు, చేతిరుమాల్లో కట్టిన పువ్వుని పైకితీసి, జడలో అలంక రించింది.

"పుష్పాలకి మాటలు రాకపోడం మంచిదైంది. అవే వాటికి భాషవుంటే. ఎంత విచిత్రమైన గాథలు చెప్పునో— వాటిపైన ఎవరేనా వ్రాసేవా రుంటే మంచి కథవుతుంది."

సుగుణతో సంభాషణ ఎప్పుడు ప్రమాదంగా పరిణమిస్తుందో చెప్పలేను. వ్యాఖ్యానా లున్న వాక్యాలు ఆమె ముందు ప్రయోగించక పోవటం శ్రేయస్కరం. ఊరుకున్నా.

"పువ్వు పెట్టుకుంటే అంత బాధపడటం దేనికి?"

"నా కాకలిగా వుంది కాబోలు, ఎందుకో కోపం వచ్చేసింది.

"సుగుణా—లోప లున్నది చెప్పెయ్యడం మంచిది, కామేశం అక్కడల్లా వుండగా, మనం యిల్లా వుండడం, నాకు మనస్క రించడం లేదు."

"ఎల్లా వున్నాం?"

"చీకు చింతా లేకుండా, దిగులేనా కనబర్చకుండా, పూలు. షికార్లు, కబుర్లు...."

బిగ్గరగా నవ్వింది.

"మొగాళ్ళకి మంచిగా నటిస్తే చాలు, ఉండనక్కర్లేదు.... నీ మంచితనమే నీ శత్రువు. కరుణాకరం: మంచితనంవల్ల ఆకలితీరదు. అన్నానికి లే" నవ్వుతూ, లోపలి కెళ్ళింది.

"అది ఆఖరి ఘట్టం, నీసలహా చెప్పు...."

కరుణాకర్రం దీర్ఘమైన శ్వాస విడిచాడు.

"ఇంతకీ నా ప్రశ్నకి సమాదానం చెప్పలేదు" అన్నాను.

అతను వులిక్కిపడ్డాడు.

"నీ ప్ర శ్నేమిటి?"

"ఆమె నిన్ను ప్రేమిస్తున్నట్లు తేలింది. నువ్వామెను ప్రేమిం చావా?"

"నే నెట్లా చెప్పను? ఖూనీ చేద్దా మనుకోడానికీ, నిజంగా చేసెయ్యడానికీ ఎంత వ్యత్యాస ముందో, ప్రేమించడానికీ, ప్రేమ

ప్రకటించడానికీ అంతుంది. నేను ప్రకటించలే దనుకుంటున్నాను.''
అన్నాడు.

కరుణాకరం పెద్ద సమస్యలో చిక్కుకున్నాడు. అతను చెప్పినదానినిబట్టి. ఆమె ప్రేమిస్తున్నట్లూ, అతను తప్పించుకు తిరుగుతున్నట్లు స్పష్టమవుతుంది. కాని నేను దీన్ని పూర్తిగా విశ్లేషించలేక పోతున్నాను. అనుకూల వాతావరణం, సానుకూలమైన వ్యక్తీ. ఈ రెండూ వున్నప్పుడే, స్త్రీ చొరవ ప్రకటిస్తుం దను కుంటాను. సుగుణ జీవితాన్ని వొక కళగా అనుభవిస్తుంది. అసాధారణ పరిస్థితులు. అపూర్వ అనుభవాలు నిర్మించుకుంటేగాని, ఆమె సంపూర్ణ వికాసం పొందదు. కరుణాకరం మామూలు మనిషి — సాధారణ మనస్తత్వం గల వాడని తోచింది. బీదరికం, ఆర్థికంగా ఆ దంపతులమీద ఆధారపడివుండటం కరుణాకరాన్ని మరింత సామాన్యుడుగా చేశాయి. నీతిని గురించిన చింత ధనికులకేగాని బీదవారికి సాధ్యపడదని వొక ఆధునిక అభిప్రాయం ప్రబలింది, మార్క్సిస్టువాదం భగవద్గీతగా చూసుకునేవారు బీదవాడు నీతిగా వుండనక్కర్లేదనడం బదులు, అల్లా వుండటం అసంభవమని వాదిస్తున్నారు. బెర్నార్డ్‌షా నాటకం కూడా వ్రాశాడు. ఇది నా దృష్టిలో సరియైన అభిప్రాయం కాదు, ప్రాకులాడేందుకూ, తమ ఆధిక్యాన్ని ప్రకటించేందుకూ ఇంకేమీ లేనందున బీదవారికి నైతికచింతన మిగిలిందంటాను. భాగ్యవంతులు సంఘంచేసే తీర్పులకు తలొగ్గకుండా త్రోసి పుచ్చగలరు. వారు ఆచారనియమాలను అతిక్రమించగలరు. నైతికచింతన వారి కవసరం లేదు. కరుణాకరం పరిస్థితి ఈ విషయాన్ని రుజువు చేసిందనిపించింది. ప్రేమించినా, అతను ప్రేమను ప్రకటించలేదు; పరపురుషుడి భార్యని ప్రేమించడం అన్యాయమని అంగీకరిస్తున్నాడు: ఆమె భర్త వ్యాధి గ్రస్తుడైనప్పుడు. ప్రేమకలాపం సాగించడం ఘోరమన్న చైతన్యం ప్రకటిస్తున్నాడు. తన గుప్పెట్లో కొచ్చిన అపూర్వ అనుభవాన్ని, నీతీపేరిట వొదిలేశాడు. సుగుణ తన డబ్బుని కరుణాకరంతో పంచుకున్నదంటే మార్క్-

శిష్ట మిత్రులు హర్షిస్తారు ప్రేమని పంచుకున్న దంటే హర్షిస్తారా?

“ఆలోచన తెమిలిందా?” అన్నాడు కరుణాకరం.

“ఆలోచనకి లొంగనివి మానసిక సమస్యలు. నే నేమీ చెప్ప లేను. కామేశానికి వొకటి రెండు నెలల్లో నయ మవుతుంది. అప్పుడు సుగుణ తన ప్రేమను యథాప్రకారం, అతని మీద కేంద్రీకరింప చేస్తుందేమో—’

“సుగుణది అంత చపలమైన ప్రేమంటావా?”

“సుగుణదే కాదు. అసలు ప్రేమే అంతటిది. సూర్య రశ్మి, నీళ్ళు లేనిదే ఏ మొక్కా జీవించనట్లు, అనుకూల వాతావరణం వ్యక్తి వున్నప్పుడే అది నిలుస్తుంది—’ అన్నాను.

“నీకు స్త్రీ ప్రేమపై నమ్మకం లేనట్లుంది.”

“తప్పకుండా నమ్మకం వుంది. కాని ఏ వొక్కరూ ‘నాది అపూర్వమైన ప్రేమ’ అంటే మాత్రం నేను నవ్వక మానను. బకెట్ బంగారంది కావొచ్చు; వెండిది కావొచ్చు; రాగిది కావొచ్చు; ఆఖరికి ప్లాస్టిక్‌ది కావొచ్చు. లోపలివి మామూలు నీళ్ళే” అన్నాను.

కరుణాకరానికిది నచ్చిందో లేదో తెలీదు. కాని నవ్వేశాడు. నేను ఆ మర్నాడు అందరి దగ్గిరా సెలవు తీసుకుని వెళ్ళిపోయాను.

రెండు నెల్ల తర్వాతగాని, మళ్ళా కామేశాన్ని చూడ్డం పళ్ళేదు. అతనికి పూర్తిగా నయమై, హాస్పిటల్‌నుంచి విడుదలవుతా డనుకున్నా. కాని అల్లా జరగలేదు. నే వెళ్ళినప్పుడు వ్యాధిపరిస్థితి ప్రమాదకరంగా పరిణమించిం దన్నారు డాక్టర్లు. స్ట్రెప్టొమైసీన్ ఇన్‌జక్షన్ల కతను తట్టుకోలేకపోయ్యాడుట. అందుచేత కొంతకాలం వాటిని నిలుపుజేశారుట. తీసుకున్న ఇన్‌జెక్షన్లు అతని శరీరాన్ని మరింత కుంగతీశాయి. శల్యంలా అయి, చూడ్డానికి భయంగా వున్నాడు కామేశం. రెండు మూడు వారాలు ఎదిగిన గడ్డం మొహాన్ని చిన్నదిగా చేసేసింది. మంచం మీదనుంచి లేవలేక పోతున్నాడు. మాట నూతిలోంచి వొచ్చినట్లు నీరసంగా వుంది. శరీరం లోపలిభాగం కదిపించేటట్టు తోచింది. ఆయాసం, గుండెలు కొట్టుకోడం, వికృత

మైన దగ్గు—అవన్నీ చూస్తే. అతనొక ప్రాణిలా వున్నాడు గాని మనిషిలా లేడు.

సుగుణకూడా చిక్కినట్లు కనిపించింది. ఇదివరకటి చలాకీ, ఉత్సాహం, అంతగా లేవు. కరుణాకరం ఎప్పటిలాగే వున్నాడు. డాక్టర్లు వొక 'లంగ్' వుపయోగపడకుండా చేసెయ్యడం అవసర మంటున్నారు. కాని కామేశం మాత్రం ధైర్యంగానే వున్నాడు. మరో నెలరోజులలో నయమవుతుందనే డాక్టర్లకి చెబుతున్నాడు. నయ మవగానే. తనం చేసేది. మళ్ళా నాతో చెప్పడం సాగించాడు. క్రాస్‌వర్డ్ పజిల్ కడుతున్నాడు.

కన్యాకుమారి చూసి కొలంబో వెళ్ళడానికి ప్రోగ్రాం వేస్తు న్నాడు. నాకు జాలేసింది. జీవితంపై తృష్ణ. మృత్యువుతో పెనుగు లాట—అవీ చూస్తే, నా కళ్ళమ్మట అప్రయత్నంగా నీళ్లొచ్చేశాయి.

“నిన్నూ తీసుకెడతాలే—ఏడవకు” అని నీరసంగా నవ్వాడు కామేశం. “సుగుణకి కాశ్మీరం కాశ్మీర్ క్యూరియోస్ కేటలాగ్ తెప్పించాను. వెళ్ళా లనుంది. కాశ్మీర్ స్టయిలు లేడీస్ వోవర్‌కోట్ సుగుణ తొడుక్కుంటే చూడాలనుంది. ఏడిచే వాళ్లెవ్వరూ నాముందు వుండొద్దు—పొండి—పో—సుగుణా—వెళ్ళండి—బైట హాయిగా విహరించండి—మీ బ్రతుకు మీరు, నా బ్రతుకు నేను—ఎవళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతకాలి....జీవితం ఎవరికోసం నిల్చిపోదు.... పొండి....”

మొహాన్ని తలగడలో కప్పేసి. ఏడ్పు సాగించాడు కామేశం.

“నాలుగైదు రోజుల్నుంచి. పరాకుమాటలు” అని సుగుణ దిగులుగా చూసింది. అతని మంచం దగ్గరగా వెళ్ళి. నుదురు రాస్తోంది.

“అమ్మో—సెంటు—ఇంత మంచి సెం టెక్కడిదీ—నాకు రాయి...”

“ఏమ్మాట లవి? కళ్లుమూసుగు పడుకోండి?” అని కసిరింది.

“కళ్ళు మూసుకుంటే నా కన్నీ కనిపిస్తాయి. తెరిస్తేనే నాకు మంచిది.”

"మీ రూరుకోకపోతే, మత్తింజక్షన్ ఇమ్మంటాడాక్టర్ని."

"అప్పుడు హాయిగా వుండొచ్చును."

"ఇట్లాగైతే, నే వెళ్ళిపోతాను."

అని సుగుణ లేవబోయింది. అత నామెని గట్టిగా పట్టుకున్నాడు.

"అమ్మో—వెళ్ళొద్దు. నన్నొదిలెయ్యకేం. వొదిలిపెడితే, నే చచ్చిపోతాను—"

పట్టు విడిలించుకుని సుగుణ వెళ్ళిపోయింది. కరుణాకరం అతని దగ్గరగా వెళ్ళి, ఉపచారం సాగించాడు. నేను కళ్ళు తుడుచుకుంటూ వరండాలో కొచ్చేశాను.

రామేశం నిద్దరపొయ్యాడు. నేనూ, కరుణాకరం యింటివైపు నడవడం సాగించాం. ఆ విషాదపరిస్థితిలో ఏది మాట్లాడినా అనర్థ్యంగా వుంటుంది. కరుణాకరం పలకరించాడు.

"ఈ జబ్బు నాకు రాగూడదూ?" అన్నాడు.

'అవేం మాటలు!"

"జ్ఞాపకం వుందా—వెనక నన్నొక ప్రశ్న వేశావు?"

"ఆ"

"దానికి సమాధానం యిప్పుడు చెప్పగల్ను. నన్ను నేను దగా చేసుకోలేక పొయ్యాను. ఆమెను ప్రేమించినట్లు వొప్పుకోక తప్పదు. నేనూ, సుగుణా దగ్గరగా వొచ్చినకొద్దీ, అతనిజబ్బు తీవ్రమవుతోంది. విషాదకరం, కాదూ!"

నేనేం మాట్లాడకపోయినా, వినడానికి సిద్ధపడినట్లు సూచించాను.

"ఆర్థికస్వాతంత్ర్యం వుంటే, మిగతా అన్నింటిలోనూ, స్వతంత్రులు కావొచ్చు ననుకుంటారు గాని, నిజానికి, ఊహలో తప్ప, మనుషులు స్వతంత్రజీవులు కారు. కొన్ని నిర్ణయాలు వాటంతటవే, నా మీదొచ్చిపడ్డాయి. తీసుకోడానికీ, నిరాకరించడానికీ నాకేమీ స్వేచ్ఛలేదు. నిర్ణయం అసంభవం అవడంలోనే ట్రాజిడీ వుందను

కుంటా. ఒకరాత్రి ... ని, యీ విషయం సుగుణతో ప్రస్తా
వించాను. చా ... ం శ్రీమ్నకుని అడిగేశాను,

'సుగ ... న్న నువ్వు ప్రేమిస్తున్నావు అవునా?'

'... రకి జబ్బు తగ్గింతర్వాత. ప్రేమిస్తే తప్పులేదంటు
న్నావు ... అన్నది

'స్వధోరణి కాసేపు నిలపగూడదూ?'

... ం చెప్పేస్తే. హాస్యంగా తోచొచ్చు. నువ్వూ నన్ను
ప్రేమిస్తున్నావు అ దెందుకు చెప్పవు? ఎటొచ్చీ, ప్రేమ రహస్యంగా
... లంటావు అంతేగా?'

అంటూ సగుణ చీరకొంగు రాతిబండమీద వొత్తుగా పరచి,
... మీద తలెట్టుకుని గడ్డిలో పడుకుంది.

'నీకు వివాహమైంది. భర్త వుండగా నువ్వు మరొకర్ని
ప్రేమించటం దుర్నీతంటాను.'

'ప్రేమించడం, ప్రేమించకపోవడం మనిష్టమా? జీవితం
ఎవరికోసం నిల్చిపోదన్నారు మా వారు. విన్నావుగా! నువ్వు
చెప్పిందే పాటించడం జరిగితే, భర్తలు భార్యల్నీ, భార్యలు భర్తల్నీ
హత్యచేస్తూ కూర్చోవాలి.'

'ఇప్పుడు మనం చేస్తున్నది అతని హత్యకిందే వొస్తుంది,'
అన్నాను.

'సరే—నేరస్థురాల్ని నేను, నన్నురిదీస్తారు, అంతేగా?'

'భర్త అల్లా బాధపడుతుంటే, నీ మనస్సులో కాస్తైనా
దిగులు, విచారం, లేవన్నమాటే!'

'కరుణాకరం,—యిట్లా చూడు—' ఆమె రెండు చేతులూ
నా మెడచుట్టూ వేసి, తొడమీద తల ఆనించి, తల ముందుకు
లాక్కుని, కళ్ళల్లోకి చూసింది,

'కామేశం చాలా మంచివాడు. అంత మంచిభర్త ఎవ్వరికీ
లభించదు అతనికి నయమవాలని వెయ్యిదేవుళ్ళకు మొక్కు
కున్నాను. నిజంగా నువ్వు మాకు చాలా సాయపడ్డావు. నీ ఋణం
మేం ఎప్పుడూ తీర్చుకోలేం. కాని దానికీ మన ప్రేమకీ సంబంధం

లేదు, నువ్వు నన్ను ప్రేమించావని ఏనాడ్[illegible]. లేకుంటే నేనింత స్నేహంగా వుండే వుండను. మనల్ని[illegible]గా చేసుగో వడం దేనికి? రహస్యం లేకపోవడమే ప్రేమ లక్ష[illegible]పు మనం మనంగా వుండిపోకూడదూ—'

ముఖంపైకి తిప్పింది అనుకోకుండా, నా చేతు[illegible] ఆమె జడను స్పృశిస్తున్నాయి. నా వొళ్లు తేలికైంది. పాదాలకింది [illegible]మి చీలి, ఎక్కడికో దిగిపోతున్నట్లుంది సృష్టి మా యిద్దరిమధ్యా స్తంభించినట్లు, వొక్కసారి గుండెలు నిల్చిపోయ్యాయి. ఆకృతిలో రెండు శక్తులుగా, అనంత విశ్వాన్ని వెదుక్కుంటూ, మళ్ళా పా[illegible] శరీరాలలోకే చేరుకున్నట్లయింది.

మొహాన్ని ముందుకు లాగింది నేను తొలగించేశాను. దూరంగా జరిగాను.

"సుగుణ, నీముందు ఏదీ దాచలేను. కామేశం అల్లావుండగా ప్రేమ ప్రకటించుకోడానికి మనస్కరించటంలేదు."

'ఆయనకి తగ్గింతర్వాత, ప్రకటించుకుందా మంటావా?'

"తగ్గితే, అసలే కూడదు: లోలో ప్రేమించుకుని, దూరంగా వుండటంలో అందంలేదూ?'

"నాకా అందం తెలీదు. అదంతా దగా అనుకుంటా.'

"కాదు, ప్రేమ ఉన్నతమైందే, కాదన్ను. దాన్ని మలినం చెయ్యకూడదు...."

"అంచేత....?"

"మన మిల్లాగే, దూరంగా వుండాలి—ఉందామని ప్రమాణం చెయ్యి...."

"ఎంతకాలం?"

"జీవితాంతం వరకూ?"

"ఎవరి జీవితాంతం?"

"ఎంతమాటేనా అనెయ్యడానికి నువ్వు జంకవు."

"ప్రేమకి రహస్యం వుండకూడ దనుకున్నాంగా, [illegible]

కింక నయంకాదు నెలల్లో కాకపోయినా, కొన్ని వారాల్లో వుంది. తర్వాత, మనకి స్వేచ్ఛ! సరేనా?”

“ఇంకేమన్నా?”

“ప్రమాణం చెయ్యమన్నావుగా. ఆయన జీవించి వున్నంత వరకూ, మనం దూరంగా వుందాం. తర్వాత, దగ్గరగా వుందాం. చెయ్యిపట్టు, వా[illegible].

చేతిలో చెయ్యేసింది, లేచాను. ఉద్రేకంలో ఏమన్నానో, ఏం చేశానో నాకు తెలీదు. ఏడుపొచ్చింది, ఆమె యింట్లో వెళ్ళింది. నేను పరుగెత్తుకుంటూ హాస్పిటల్ కెళ్ళి కామేశాన్ని చూశాను. నిశ్చింతగా నిద్రపోతున్నాడు, అమ్మయ్య అని నిట్టూర్చాను....”

కరుణాకరం కళ్ళంట నీళ్లు కారడం చూశాను. “నువ్వేమీ బెంగపడొద్దు కరుణాకరం. ఇప్పట్లో మనం చెయ్యవల్సింది కామేశాన్ని సరిగ్గా చూడటమే. మీ ప్రేమలో నిరసించవల్సిం దేమీలేదు మీరు చేసుకున్న నిర్ధారణ హర్షించవలసిందే....”

కామేశం డాక్టర్లు చెప్పినదాన్నిబట్టి ఎన్నో రోజులు జీవించ డనిపించింది అతడు పడుతున్న బాధ చూస్తే. మృత్యువు తొందర్లో రావడమే మంచి దనిపించింది. రోగికల్లా వుండదని నాకు తెలుసు. ఇతరులను గురించి, తీర్పులు చెయ్యడం లోకజ్ఞానం లేనివాళ్ళకి కూడా సుళువే!

ఆ మర్నాడు కరుణాకరం, బెంగుళూరు ప్రయాణమయ్యాడు. అక్కడ టి. బి. స్పెషలిస్టు వొకాయన కొత్తగా, స్విట్జర్లాండ్ లో నాలుగేళ్లు తర్ఫీదుపొంది వొచ్చాడుట. ఆయన్ని తీసుకొచ్చి, కామేశం విషయంలో సలహా పొందడం మంచిదని డాక్టర్ల సలహా. రానూ పోనూ, ఫస్టుక్లాస్ ఖర్చులు పెట్టి, అతన్ని తీసుకొచ్చాడు. స్పెషలిస్ట్, 'లంగ్' కొలాప్స్ చెయ్యనక్కర్లేదనీ, శరీరం తట్టుకోగల్దు కాబట్టి, ఇంజక్షన్లు వరసగా యివ్వొచ్చుననీ, సలహా యిచ్చి, అతను స్విట్జర్ లాండ్ నుంచి తెచ్చిన ఇంజక్షన్ల బాచ్, శానిటోరియమ్ డాక్టర్లకిచ్చి, బెంగుళూరు వెళ్ళిపొయ్యాడు. ట్రీట్మెంట్ సాగుతోంది. ఆ నాలుగు రోజులూ అక్కడేవుంది. ఎల్లా వున్నదీ వ్రాస్తూండమని, కలవ

తీసుకుని, నే వెళ్ళిపొయ్యాను. కామేశాన్ని మళ్ళా చూడ నను కున్నాను. నా శరీరం అతనిముందు దిగవిడచి వెళ్ళిపోయినట్లుగా వుంది జీవితం ఎవ్వరికోసమూ నిల్చిపోదన్న కామేశం పరాకు మాట నే నెన్నడూ మరిచిపోను.

నే వూళ్ళో లేకపోవడం మూలాన. కరుణాకరం వ్రాసిన రెండు మూడు త్తరాలూ చూడ్డం పడనేలేదు. అది వేసంగి - పెళ్ళిళ్ళ ముహూర్తాల కాలం. కావల్సిన నాలుగైదు పెండ్లిళ్ళకి వూళ్లు తిరుగు తుండడం మూలాన, కామేశం గురించిన వార్త నాకందలేదు. శుభ సమయాల్లో. వ్యాధిగ్రస్తుని ప్రసక్తి ఎత్తడం, స్మరించడం మంచిది. కాదని, అంతగా పట్టించుకోకపోయినా, నా ఊహలో ఆ వ్యక్తులు సంచారం చేస్తూనే వున్నారు. కామేశం చనిపోయిన పక్షంలో, సాను భూతి లేఖ ఎల్లా వ్రాయాలో కొంత అనుకున్న మాట వాస్తవం. స్నేహాలకూ, ఆంతరంగికాలకూ ఈ యుగంలో ఎవరికీ తీరుబడి లేనట్లుంది. అంతా తలో కెరటంపైనా, ఎక్కడికో కొట్టుకు పోతున్నాం.

మన సామీప్యంలో తేలిపోతున్న యే రబ్బరు తిత్తినో, యే కార్కునో, ఏ గడ్డిపోచనో కాసేపు పట్టుకోడం, అది మనల్ని మొయ్యలేదని గ్రహించి వొదిలెయ్యడం, చివరికి ఏదో రాతిబండ. శాశ్వతంగా కనబడితే దాన్ని పట్టుకోడం, అది కరిగి—మనం, అదీ, అందరం మునిగిపోవడం, ఇదే జరుగుతోంది. మునిగిపోతున్న వాళ్ళని చూడ్డం తప్ప, ఎవళ్ళేం చేయగలరు?

మా కృష్ణమూర్తి పెళ్ళికి వెళ్ళినప్పుడు తెలిసింది. కామేశానికి నయమైందనీ, 'డిశ్చార్జ్' చేశారనీ—అందరూ వాళ్ళ స్వగ్రామం వెళ్ళిపోయారనీ. నాకు చాలా ఆశ్చర్యం వేసింది, సంతోషం కూడా కలిగింది. వెంటనే. సంతోషం ప్రకటిస్తూ కామేశానికొక ఉత్తరం వ్రాశాను. దానికి జవాబు, రెండు వారాల తరవా తొచ్చింది. నన్ను వాళ్ళ గ్రామం వొచ్చి, వొక వారంపాటు గడప మన్నాడు. అతను చెయ్యదల్చిన యాత్రల విషయంలో నా సలహా కావాలిట. వీలవుతే నేనూ, వాళ్ళతో ప్రయాణం కావాలిట. నా కివ్వవల్సిన బహుమానం

మాట నిర్ధారణ చేసుకుని మరీ రమ్మన్నాడు. ఉత్తరంలో కరుణాకరం మాట ఏమీ లేదేమిటా అనుకుంటుండగా, యీ చివరి వాక్యాలు కనబడ్డాయి.

"మళ్ళీ కరుణాకరం—వెళ్ళేవ్యక్తి—హరాం సాగిందాడు. ఉబ్బు జనాన్ని ఆకర్షిస్తుం దంటారు. అదేం ఖర్మమో, నా దగ్గర నుండి అంతా పారిపోతుంటారు; నువ్వూ అంతే. నే నేం పాపం చేశాను? వ్యాధిగ్రస్తుని సావాసం ఎవరికీ సరిపడదు; ఒప్పుకుంటాను. ఇప్పు డేం వ్యాధి లేదుగా? ఎన్సైక్లోపీడియా కోసం ఇంగ్లండ్ వ్రాశాను."

నా ప్రెజెంట్ విషయం—ఏమడగాలా, అని మళ్ళా ఆలోచనలు సాగించాను. సుగుణ నాకు భార్య కావాల్న మాట జ్ఞాపక మొచ్చింది. భార్య కావాలని వెంటనే సమాధానం వ్రాశాను.

వ్రాసిన రెండు వారాలదాకా, కామేశాన్ని చూద్దాం పడలేదు. సాయంత్రం నాలుగైంది. వర్షంపడుతోంది. బండిదిగి యింట్లో కెళ్ళే లోగా తడిసి ముద్దయ్యాను. కామేశం పొడుగాటి సోఫాలో కూర్చుని బత్తాయిపండ్ల రసం త్రాగుతున్నాడు. నన్ను చూడగానే మందహాసం చేసిలేవబోయ్యాడు. నేను కూర్చోపెట్టాను.

"సోఫా పాడవుతే సుగుణ చంపేస్తుంది" అన్నాడు. లోపలికి కేకేసి. పంచె, తువ్వాలు తెమ్మన్నాడు. నేను ప్రక్క హాల్లో కెళ్ళి దుస్తులు మార్చుకున్నా. హాలంతా చిందర వందరగావుంది. కట్టేసిన హోల్డాల్స్ రెండున్నాయి. సామాన్లబుట్ట రెండు సూట్కేసులూ కనిపించాయి, శంకరయ్య టిఫిన్ కారియర్ సర్దుతున్నాడు.

"ఏమి టిదంతా కామేశం? — ప్రయాణ సన్నాహంలా వుంది?" అన్నాను.

శంకరయ్య టీ తెచ్చాడు.

కామేశం తేరుకుని బాగానే కనిపించాడు. ఎటొచ్చీ కళ్ళకింద కొత్త చర్మం జారి బంతిలాగైంది. కళ్ళు ఇంకా లోతుగానే వున్నాయి. గ్రాఫ్ చేయించుకోడం మూలాన కాబోలు, మొహం మరీ చిన్నదిగా,

—సైజ్ తగ్గించినట్లుగా—కనిపించింది. స్వచ్ఛంగా, కొత్తగా, నిర్మలంగా కనిపించాడు—తాకితే ఏమవుతాడో ననిపిస్తుంది.

"ఆరు గంటలకు ప్రయాణం" అన్నాడు.

"ఎక్కడికి కని అడక్కూడ దనుకో...." అన్నాను. వెటకారానికి నవ్వుకున్నాను.

"నీ కింకా తెలీదు కాబోలు. కరుణాకరానికి క్షయని తేలిపోయింది. శానిటోరియమ్‌లో వుండిపోయ్యాడు."

నేను నిర్ఘాంతపొయ్యాను. ఆలోచన సాగలేదు. మాట రాలేదు.

"అంతా చిత్రంగా జరిగింది. ఇక్కడికి కొచ్చావూ - పోయ్యేవారం పది రోజులకే, కాస్తంత టెంపరేచర్ రావడం, అన్నహితవు పోవడం, కాళ్ళు చేతులు తిమ్మెర్లనడం—వెంటనే డాక్టర్ ఫిలిప్‌కి వైరిచ్చి పిలిపించాం. ఎక్స్‌రే టెస్టుచేశాడు. నాలుగు రోజులు అబ్జర్వేషన్‌లో వుంచుతానని శానిటోరియమ్‌లో చేర్పించాడు. నిన్ననే ఉత్తరం వొచ్చింది. టి. బి. యేట. చాలా ఎర్లీ స్టేజ్, నువ్వావొ రాగూడదూ, చూసొద్దువుగాని." అన్నాడు.

ఈ వార్తకి కాని, ప్రయాణానికి కాని సిద్ధపళ్ళేదు. "మీరు వెళ్ళి ఎల్లా వున్నదీ వ్రాయండి,—తరవాత నింపాదిగా, నాలుగు రోజులుండే ఏర్పాటు చేసుకునొస్తాను, మా బాబయ్యగారి కోర్టు వ్యవహారం వొకటుంది" అన్నాను.

సుగుణ బైటకొచ్చింది.

"మీకేదో వొంక దొరుకుతూనే వుంటుంది" అంది.

ఆమెలో చెప్పుకోతగ్గ మార్పేమీ లేదు. దిగులుగా వుందేమో, నాకల్లా అనిపించలేదు. గొంతు గద్గదమైంది—కంఠంలో జీర—రొంపవల్లేమో, తల్లో పూలున్నాయి; వెడల్పు జరీ తెల్లచీర; ఎర్ర ప్లాస్టిక్ గాజులు—అప్పట్లో ఫాష ననుకుంటా—ఎర్ర ముఖమల్ స్లిప్పర్స్, ఇదివరకు లేని గీటు, అరంగుళం పొడుగుది—గడ్డంకింద కనిపించింది. ప్రశ్నార్థకంగా చూశాను.

"ఇదేనా?—మొన్న ఏపిల్ కోస్తుంటే, చేతికి టేబిల్ క్లాత్

అడ్డమొచ్చి చాకు పైకి మానుకుపోయింది" అంది. గడ్డం కింద మానిపోయిన గాయాన్నుద్దేశించి, నా మనస్సులో వున్న ఆలోచనల్ని సుగుణ పసికట్టేసింది. కాని ఆమె మనస్సులో ఆలోచనల్ని బ్రహ్మదేవుడు కూడా తెలుసుకో లేడనుకుంటా.

నన్ను ప్లీడర్‌గారింట్లో దింపేసి, వాళ్లు స్టేషన్ కెళ్ళి పొయ్యారు. నాకారాత్రి నిద్రపట్టలేదు. జీవితం అంటే భయమేసింది. వొకటి తెలుసుకున్నాను—భాగ్యవంతులకే టి. బి. వొస్తుందన్న ప్రతీతిలో యధార్థం లేదని.

వారం రోజుల్లో కరుణాకరం దగ్గర్నుంచి వుత్తరం వొచ్చింది. నాతో ఎన్నో చెప్పాలిట—నాలుగు రోజులుండేలా వీలు చేసుకుని రమ్మన్నాడు,

ఉత్తరం వొచ్చిన పది రోజులకి నేను కరుణాకరాన్ని చూడ్డానికి వెళ్ళగలిగాను. కామేశం, శంకరయ్య స్టేషన్‌కొచ్చి. నన్ను 'సంతోషి'కి తీసుకెళ్ళారు కామేశం మరికొంచెం తేరుకున్నట్లు కనుపించాడు, మొహంలో నిగనిగ, కళ్ళలో కొత్త ఉత్సాహం కనబడ్డా, పూర్తిగా మామూలు మనిషిగా లేడనిపించింది, వ్యాధి నుంచి తేరుకున్న వారితో, దగ్గరగా, ఎక్కువ చనువుగా వుండలేం కాబోలు.

"నీకు పెళ్ళాం కావా లన్నమాట!—" అన్నాడు కామేశం బిగ్గరగా నవ్వుతూ.

"ఎవరేనా నీ ఎరికిలో వున్నారా?"

"ప్రయివేట్ వార్డు కావడం మూలానా, మా ఆవిడ సపర్యల మూలానా, మా నర్సుల్ని అంతక్లోజ్‌గా తెలుసుకోలేదు" అన్నాడు.

"నే నిల్లా వుండటం నీ కిష్టంలేదా?"

"అంటే?"

"నర్సుని చేసుకున్న వాడు, సుఖపడా లంటే, ఏదేనా జబ్బు తెచ్చుకోవాలి కదా?"

"నిజమే—నాకు జబ్బుగావున్న రోజుల్లో, నా క్కావల్సినవాళ్ళందరికీ. టి. బి వొస్తే బాగుండు ననిపించేది చెప్పొద్దూ."

భోజనం చేసి తాంబూలం వేసుకుంటుంటే సుగుణ కనిపించింది.

"ఎట్లా వున్నాడీ పూట?" అని అడిగాడు కామేశం. "ఆ - అట్లాగే వున్నాడు. షేవ్ చేసుకోడు — బద్ధకంట. దాంతో మరీ చీదరగా కనిపిస్తాడు." అన్నది సుగుణ. ధోరణిలో కాస్తంత విసుగు ధ్వనించింది నాకు.

"షేవ్ చేసుకోడం ఆరోగ్యంగా వున్న వాళ్ళకే యాతన. నీకేం తెలుస్తుంది? అదొక అపరేషన్ లాంటిది."

"ఆరోగ్యంగా వున్న వాళ్ళకి లక్ష వ్యాపకాలుంటాయి. క్షురకర్మకి తీరికుండక విసుక్కోటం — రోగి కంటావా — అతనికి — శరీరాన్ని చూసుకోడంలోనే తృప్తి, ఆనందం వుంటాయి" అన్నాను నేను.

"బాగా చెప్పారు."

కాసేపు వెన్ను వాల్చి లేచేటప్పటికి నాలుగైంది. శంకరయ్య ఉప్మా చేశాడు — కాఫీ ఇచ్చాడు. సుగుణ కొత్త బిస్కట్స్ పాకెట్ విప్పింది.

"అవి అతనికోసం తెప్పించినవి" అన్నాడు కామేశం.

"అవుతేనేం?"

"అవన్నీ మనమే తినేస్తే ఎల్లాగ!"

"ఎందుకు తినకూడదు? మనం మనుషులమే."

"గొప్ప డిస్కవరియే — నోబుల్ బహుమానం యిస్తార్లే."

"మంచి ప్రవర్తన బహుమానం మీకు ఇస్తార్లెండి."

"ఛట్."

అని కామేశం విసుక్కుని, బల్లమీద వార్తాపత్రికని దూరంగా గిరవాటెట్టాడు. నాకేం చెయ్యాలో తెలీక, అరు బైట కొచ్చేశాను. వెనకాలే, కామేశం వొచ్చేశాడు.

"చాలా న్యూసెన్స్‌గా వుంది" అన్నాడు స్వగతంగా.

నేనేమీ మాట్లాడలేదు. నడుస్తున్నాం. అతనే చెప్పడం సాగించాడు.

"నేను మంచానపడ్డ మూడు నెలలూ, కుక్కలా మమ్మల్ని

కొడుకుని, అడ్డమైన చాకిరీ చేశాడా కరుణాకరం. ఇప్పుడతన్ని వొదిలేసి ఎల్లా వెళ్ళగలం చెప్పు! పోదామంటుంది. ఊటీ పోదాం, మహాబలేశ్వరం పోదాం, మైసూర్ పోదాం...."

"అంటే ఈ ఆస్పత్రి వాతావరణం నీకంత మంచిది కాదని [illegible]లు."

"నా మంచి నాకు తెలీదంటావా?"

"ఆహాహ(, అదికాదు. ఇన్నాళ్ళూ ఆమెకూడా, సరిగా తిండి తిప్పలూ లేకుండా, అవస్థ పడిందా—నిశ్చింతగా, ఎక్కడేనా. రెస్టు తీసుకుందామని వుండడం, అసహజం కాదనుకుంటాను." అన్నాను.

"ఇప్పు డిక్కడ రెస్టు కాక ఏముంది? అంతా డాక్టర్లూ నర్సులూ చూస్తున్నారు—ఊరికే, మనం పైపై హంగామా. మోరల్ సపోర్టు. కాస్త ధైర్యం చెప్పడం."

నాలుగైదు నిమిషాలదాకా, ఎవళ్ళం మాట్లాడలేదు. ఒక్కసారిగా కామేశం:

"స్త్రీలకి మర్యాద తెలీదు" అన్నాడు. నేను చకితుడనయ్యాను. భయంతో గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"అతనట్లా బాధపడుతుంటే, మనం నవ్వుతూ. పేలుతూ వుండటం తప్పు—తప్పేమిటి—పాపం అంటాను"

ఇంతట్లో శానిటోరియమ్కు చేరుకున్నాం. కరుణాకరం జనరల్ వార్డులోనే వున్నా. చివరగా వున్నాడు. మేం మంచం పక్కన, రెండు బల్లలు లాక్కుని కూర్చున్నాం.

కరుణాకరం గడ్డం వారం పదిరోజులనుంచి చేసుకున్నట్లు లేదు. దట్టంగా పెరిగింది, అక్కడక్కడ, గడ్డంలో నెరిసిన వెంట్రుకలు కూడా కనిపిస్తున్నాయి లోతు నూతిలో కనిపించిన ప్రతి బింబంలా. నవ్వి నప్పుడు పళ్ళు దూరంగా, మసగ్గా మెరుస్తున్నాయి, మాట బలహీనంగా వుంది. టి. బి —మనుషుల్లోని ప్రత్యేకతను తొలగించి, సమంగా చేసేస్తుంది, ఆ లక్షణాలు నే నెప్పుడూ మరిచిపోను. కణతలకి అతుక్కుపోయిన చర్మంలోనుంచి, ఆకు పచ్చ తీగలా వొంకర్లు తిరిగిన పచ్చ నరాలు, లేస్తూ పడుతూ, కొట్టు

కోడం, కళ్ళకింద ముడతల్ని సహితం పీల్చుకుని కరిగించి. అస్తి పంజరానికి అతికేసిన బుగ్గలపై చర్మం. - శరీరం యంత్రంపై పొరలా—జీవిత రహస్యాన్నీ, సృష్టిలో ఇంద్రజాలాన్ని, మన కళ్ళముందు ప్రదర్శించినట్లు అదిరిపడే స్థూలకాయం....

కరుణాకరం క్రాస్‌వర్డ్ పజిల్‌లో నిమగ్నుడయ్యాడు.

"గాడిద-అనే అర్థం వొచ్చే మూడక్షరాల మాట చెప్ప" అన్నాడు.

"ఇది పాతదే—ఇంగ్లీష్‌లో 'యూ' " అని కామేశం నవ్వడం సాగించాడు.

కరుణాకరం. అతని జబ్బును గురించి వివరాలు చెప్పాడు లక్షణాలు వర్ణించాడు. తగ్గిపోతోందిట, రెండు మూడు వారాల్లో లేచి తిరుగుతాడట. క్రాస్‌వర్డు పజిల్ విప్పేటందుకు తగినంతటి తీరుబడీ, మనో నిశ్చలత్వం కుదిరాయిట, తప్పకుండా నెగ్గుతాడుట.ఆ డబ్బుతో అతను చేయదల్చుకున్నవన్నీ ఏకరువుపెట్టాడు, అమెరికన్లు చచ్చిపోయింతర్వాత. పారిస్ వెడతా రన్నట్లుగా. భారతీయులు మరణించిం తర్వాత, హాలీవుడ్ వెడతారు కాబట్టి. 'లాసాంజలీస్' పట్నం వెడతాడుట. ముఖ్యంగా చూడవల్సిన వాళ్ళు పాల్‌ముని,మిర్నాలాయ్. జినీటయిర్నీ, ఏదేనా పత్రికలో ఏర్పాటుంటే చేరిపోయి, అక్కడే వుండిపోతాట్ట.

"ఇంతకీ కరుణాకరానికి, పెండ్లి చేసేస్తే, యీ జబ్బే రాక పోను, మనస్సంతా హాలీవుడ్ తారలమీది కెడుతోంది" అన్నాడు కామేశం.

"బ్రహ్మచారులకి ఈ జబ్బు రావంటారు. డాక్టర్లు" అన్నాను.

"అల్లా, లేడీ డాక్టర్లనాలి" అని. కామేశం బిగ్గరగా నవ్వాడు.

చుట్టుపక్క రోగులు మాకేసి వింతగా చూశారు. కొందరి మొహాల్లో భీభత్సం, మరి కొందర్లో భయం, యింకా కొందర్లో కొంటెతనం కనిపించాయి. కామేశం చనువుగా దగ్గర్లో వున్న రోగులని పలకరించి. ఛలోక్తులు వేస్తున్నాడు. అతని ధోరణి చూస్తే వాళ్ళని చూసి అసూయపడినట్లుంది, అప్పుడే యీ స్వేచ్ఛనంతా

వాడులుకొని, సంసారం బురదలో పడిపోయినందుకు రోగులంతా, అతన్ని చూసి జాలిపడినట్లనిపించింది ఇంతలో శంకరయ్య దర్శ్గిర వొచ్చాడు. అమ్మగారు చప్పున రమ్మన్నా రన్నాడు. కామేశం వినుక్కొని, మళ్ళీ వొస్తానని చెప్పి, వెళ్ళిపోయాడు.

సూర్యుడు నర్సెస్ క్వార్టర్స్ వెనక దిగాడు. గాయం పడి నట్లు ఆకాశంలో సంధ్య చిమ్మింది. బాండేజ్‌లు తీసుకొచ్చినట్లు, మేఘాలు కమ్ముతున్నాయి, రక్తాని కవన్నీ తడిసినట్లు. నల్లగా, పచ్చగా, ఊదాగా మారి చీకట్లో కరుగుతున్నాయి.

కరుణాకరం, నేనూ బైటికొచ్చాం. వార్డు బోయ్ పడక్కు ర్చీలు తెచ్చాడు.

"నీకిట్లాగవుతుందని ఎప్పుడూ అనుకోలేదు' అన్నాను.

"నేనూ అనుకోలేదు. కాని అవుతే బాగుండుననుకునేవాణ్ణి" అన్నాడు.

"అంటే?"

"టి. బి. వల్ల బాధపడేది రోగికాదు—అతన్ని కనిపెట్టు కునేవాళ్ళదే సమస్య. భర్తకి జబ్బు చేస్తే భార్యకి, పిల్లలకి నరకం; భార్యకి చేస్తే. భర్తకి నరకం. వాళ్ళు దగ్గరగా రాకూడదు; దూరంగా వుండలేరు. అనుమానాలు, మనస్పర్ధలు—ఆశ, నిరాశ—నిరంతర మానసికక్షోభ. కాల నిర్ణయం లేదు; తొందర్లో చేసిన తప్పులు దిద్దు కోడానికి లేదు. నిజంగా యీ సమస్యని ఎవరూ తీర్చలేరు. ప్రభు త్వం ఏం చేస్తుంది? రోగి తాలూకు వాళ్ళ భుక్తిని చూడాలి; చూడగల్దు; కాని వారి అంతరంగిక జీవితాన్ని, హృదయాలని, వుద్రేకాలని తాక లేదు. టి. బి, కోరే త్యాగం, యీ మనుషులు చెయ్యలేరు. ఒకవేళ చేసినా, దానికి ఫలితం లేదు. హర్షించేవారు లేరు. నిష్కామ కర్మ లాంటిది నా విషయం తీసుకో, నా కోసం కాచుకున్న వాళ్లు లేరు. నే నొక సమస్యకాను"

"కామేశం, సుగుణ...." అన్నాను.

"అవును. కాని వారి ఆప్యాయం వారికెంత హానికరమైందో నేనూహించగలను. కామేశానికి జబ్బుగా వున్న రోజుల్లో నేనూ.

సుగుణ ఏమైనా చేసి వుంటే, యిప్పుడు నా కెట్లా వుంటుందో ఆలోచించు. కామేశం చూపుతున్న ఆదరణకి, నేను జీవించగలనా?....'

కంఠం నీరసించి, గొంతులో తన్నుకుంటున్నట్లుంది. చీకటి రగ్గులా మమ్మల్ని కప్పేసింది. అతని కళ్ళు బాధతో ఎట్లా మూసుకు పోతున్నాయో, నేను చూడలేక పోతున్నాను.

"సుగుణ మళ్ళా ఆ విషయంలో ఏమంటోంది—?"

"సుగుణ—మొదట్లో నాలుగైదు రోజులు, తరుచు యిక్కడే గడుపుతూ, కనుక్కునేది. తరవాత యిక్కడికి రావడం తగ్గించింది, నీ కోటి చెబుతాను. మనస్సులో పెట్టుకో. నే మంచాన పడింతర్వాత, నాకు సుగుణ పరిచయం కావల్సి వొచ్చింది. కామేశానికి జబ్బుగా వున్నప్పుడు, నేను చేసిన త్యాగానికి ప్రతిఫలం యిప్పుడు కోరుతు న్నానేమో తెలీదు-ఎందుకో ఆమెపై వొక హక్కు నాకు వున్నట్లు అని పిస్తుంది. కాని చిత్రం—సుగుణ పెడమొహం పెడుతోంది. పెద్ద మంటని, నీటి బిందువుతో ఆర్పేసినట్లుగా, చప్పున చల్లారింది;.... ఈ విషయాలు ఆమెతో ముచ్చటించే సాహసం నాకు లేదు: ఆమెకీ యిష్టంలేదు."

"జబ్బువల్ల పోగొట్టుకున్న స్థానాన్ని మళ్ళీ ఆమె కామేశంలో ఆక్రమించుకుంటోందేమో," అన్నాను.

"నువ్వింత సరిగ్గా ఎట్లా కనుక్కున్నావు?"

"వాళ్ళ మాటల ధోరణే అట్లాగనిపించింది."

"కాని, కామేశం హృదయంలో ఖాళీ స్థలం వున్నట్లు లేదు. ఏదన్నా కాస్త వుంటే, అది నా కోసం వుంచేశాడు, సుగుణని అందులోకి ప్రవేశించనీయడంలేదు...."

"అవును. ఆ విషయం, యిక్కడికొచ్చేముందే. అతను నాతో చెప్పాడు...."

"నా జబ్బు వారిద్దర్నీ కలవనీకుండ చేసిందనే నా బాధ. నా వల్ల కామేశం తన సుఖాలని త్యాగం చెయ్యాల్సి వొచ్చింది: చేస్తు న్నాడు. దానికి ఆమె నన్ను క్షమిస్తుందంటావా? అతను నన్నెంతగా లోలోన తిడుతుంటాడో. నాకీ జబ్బు లేకుండా, మామూలు మనిషినై

వుంటే, యిట్లాంటి పర్యవసానానికి, ఆత్మహత్య చేసుకునుందును. కాని, ఈ జబ్బులో ఏముందో! నాకు జీవించాలనే వుంది. నా కెవ్వరి పరిచయం అక్కర్లేదు. ఊరికే, ఆకాశంలో నక్షత్రాలకేసి చూస్తూండడమే గొప్ప అనుభవం. ఈ మనుషుల—వారి రాగ ద్వేషాలు, రాజకీయాలు, కలహాలు—ఏవీ నన్నంటవు. నేనూ దూరంగా వుండి, వాటిని చూచి, జాలిగా నవ్వగలగడం జీవితలక్ష్యం...."

ఆరుబైట యింక కూర్చోడానికి వీల్లేదని కరుణాకరాన్ని లేవదీసి లోపలికి తీసుకెళ్లారు ఎటెండెంట్స్. మళ్ళా ఉదయం వొస్తానని చెప్పి, నే వెళ్ళిపొయ్యాను. దూరంగా, రోగుల నవ్వులు, మాటలు, దగ్గులు, ఆవలింతలు-సన్నగిల్లుతున్నాయి. వాళ్ళందరూ నన్ను చూసి, వొక రోగిలా భావిస్తున్నట్లుయింది. జీవిత ప్రవాహంలో కొట్టుకుపోతుంటే, కాసేపు ఏవో, అంచులు, దరులు చేతులకి తగిలినట్లయింది, అదొక వింత స్పర్శ-వొక కదలిక—అదేమిటో తెల్సుకునేలోగానే, అదంతా మాయమై మాటు మణుగుతుంది.

ఆ మర్నాడు రాత్రి, మరోటి జరిగింది. భోజనాలు చేశి, నేనూ, కామేశం, సుగుణ బైట మంచాలు వాల్చుకుని కూర్చున్నాం. ఆ సాయంత్రం కరుణాకరం టెంపరేచర్ మరో డిగ్రీ హెచ్చిందనీ, యిదివరకు మల్లే గంటసేపుండి పోవడం కాక, మూడు గంటలపైగా వుంటోందని తెల్సింది. టి. బి. టెంపరేచర్ విషయం, కామేశం చెబుతున్నాడు.

"తగ్గుతూ, హెచ్చుతూ అల్లాగే వుంటూంటుంది, దీనికేమన్నా అంతంటూ వుండేగా...." అంది సుగుణ.

"ఎందుకు లేదు. నా విషయంలో చూశావుగా, నాకంటె, ఎర్లీ స్టేజ్ కాబట్టి నా కంటె తొందర్లోనే కరుణాకరానికి, టి. బి. కన్య విడాకులిస్తుంది." నేను నవ్వేశాను.

"వివాహం, విడాకులు—అంటే, మన వాడికి నవ్వు!" అని కామేశం నన్ను హేళన చేశాడు.

"ఎందుకు నవ్వడం? అతను మామూలు మనిషి. మీ కింకా రోగం తగ్గినా, రోగి మన స్తత్వం పోలేదు." అంది.

కామేశానికి కోపం వచ్చింది.

"అంటే?"

"అంటే ఏముంది? మన మింకా యిల్లా కొంతకాలం యీ రోగులమధ్య గడిపా మంటే, మనందరికీ, ఆఖరికి యీయనకి కూడా, పిచ్చెత్తిపోతుంది. మన మిట్లా విచారం నటిస్తూ, అన్నీ వొదులుకుని యీ పీడ యెప్పుడు విరగడవుతుందా అని లోలోపల అనకోడం అసహజం—అన్యాయం. ఈ నాటకం యింక మనం ముగించవచ్చు" అంది పుద్రేకంతో.

"ఎవరిది నటన?—నీది నటన కావొచ్చు. నువ్వు చెప్పింది నిజమైతే, నా జబ్బులో నువ్వు చేసిన ఉపకారం అంతా నటనే. ఇంకా నీదే నాటకం...."

సుగుణ కళ్ళల్లో కన్నీరు దీపం వెలుగులో సన్నగా కదిలింది. చివాలున లేచి మంచం మడిచేసి వరండాలో కెళ్ళింది.

"నాటకం అనీ, నటననీ—వొప్పేసుకున్నందుకు సంతోషించండి. ఆ మాత్రం నిజాయిజీ మీకేది?"

"ఛీ, ఛీ—ఆడజాతికి లేదు నీతి, నియమం" అని కామేశం కూడా లేచాడు. నేను అతని బుజంమీద చెయ్యి వేసి సవరించి బుజ్జగించాను. ఇద్దరం అల్లా మైదానంకేసి నడుచుకుంటూ వెళ్ళాం.

పావుగంటవరకు ఎవ్వరం మాట్లాడలేదు.

"అవతల వాడు చావుకి సిద్ధమయ్యాడు తనకిప్పుడు షోకులు, షికార్లు, శృంగారం కావాలిట!!" అని వెక్కిరింపుగా, దూషణ అన్నాడు ఏ మనాలో నాకు తెలీలేదు.

"వాడు చావడూ చావడు, బ్రతకనూ బ్రతకడు. బ్రతికున్నంత వరకూ, నే నల్లా సుఖించలేను. దాని కా బాధలేదు. అన లా సెంటి మెంటే లేదు. అదే నా బాధ."

"సుగుణ అల్లా పుంటడంలో కొంత సబబు, న్యాయం లేదంటావా? ఆలోచించు. చాలా రోజులు నిన్ను కనిపెట్టుకునుంది. నీకు తగ్గింది. ఆమె కది ఎంతో సంతోషాన్ని కలుగ చేసి వుంటుంది. భర్తతో వినోదించాలని పుబలాటపడడంలో దోషం ఏముంది?"

"నాకు నయంకాకపోతే, ఏం చేసుండేది?"

"అది ఊహించి ఇదవడం దేనికి?"

"అట్లాంటి పరిస్థితులలోనే మనుషుల శీలం, బైట పడేది. ఉత్తప్పుడు అందరం మంచివాళ్ళమే, నీతి పరులమే."

"కాని, కామేశం—నీతి, శీలంకూడా మానవులకు సహజమైందిగా, సాధ్యమయ్యేదిగా వుండాలనుకుంటాను." అన్నాను.

"అది నీతే కాదు—కేవలం మర్యాదనిపించుకుంటుంది."

ఆ రెంటికి తేడా ఏమిటో నాకు తెలీలేదు. కాని నే నా విషయం పైకన్లేదు

"మీరంటున్నది వొకరకంగా అసహజమైన వాతావరణమే. కామేశం! ఆమె సలహా నామోదించి, వో నెలపాటు ఎక్కడికేనా వెళ్ళి రావడం మంచిది. కరుణాకరానికిది నెలలో తగ్గే వ్యవహారం కాదు. మార్పు మంచిదనుకుంటాను" అన్నాను.

"తను వెళతానంటే నా కభ్యంతరం లేదు. నన్నూ రమ్మని చంపుకు తింటూంది."

"నువ్వు లేకుండా ఆమె వెళ్ళి చేసేదేముంది?"

నాకు నవ్వొచ్చింది.

"అట్లా దూరంగా కులకడం నాకు చేతగాదు. నాకు హృదయం వుంది. కరుణాకరం జబ్బుతో వున్నంతకాలం నే నా పని చెయ్యలేను...."

తనకి జబ్బుగా వున్నప్పుడు, సుగుణ ఎట్లా వినోదించిందో కామేశానికి తెలుసా? తెలుస్తే, అతనిట్లా అంటాడా? అతను భార్యపై, శరీర సుఖాలపై చూపే విముఖత్వం జబ్బు వల్ల జనించిందా, నిజమైందా? నిజమైందైతే దాని విలువెంత? ఇల్లాంటి ప్రశ్నలొచ్చాయి. వాటికి సమాధానాలు తెల్సుకునే నిశ్చలత్వం లేకపోవడం మూలాన, వాటిని వొదిలేశాను.

కాని, కామేశంపై నాకున్న గౌరవం పెరుగుతోంది. ఆ త్యాగంలో నాకు పరిపూర్ణత కనిపించింది, అందులో నిండుదనం ఉంది, గొప్పతనం ఉంది, మానవుడు ఎంత ఎత్తైన శిఖరాన్ని అందు

రోగండో సూచిస్తూంది. ప్రతిఫలా పేక్షలేని స్వార్థ రాహిత్యం, త్యాగం నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. సంస్కారం, కళలు, వేదాంతం- వీటి ప్రాబల్యం. జీవితంలో ప్రవర్తనపై కనబడాలి, అట్లా కనబడని నాడు ఇవన్నీ వృథా. సంస్కారం, కళ, వేదాంతం, అన్నింటిని పరి పూర్ణంగా సాధించడంలో ఘనత లేదు. ప్రవర్తనలో వ్యక్తం చెయ్య గలగడంలోనే గొప్ప తనం వుంది. ఆ విధంగా కామేశం, గొప్ప వాడిలా కనిపించాడు. లేక నా కట్లాంటి అభిప్రాయం కలగచెయ్యా లన్న సంకల్పంతో, అలవర్చుకున్న విముఖత్వమా? నాకు నవ్వొ చ్చింది. నే నెంత చెడ్డవాణ్ణి! గొప్పతనానికి, నోటి పునాదులు తవ్వు తాను. ఏదో లోపం చూసి తృప్తిపడతాను. ఇతరుల మంచితనాన్ని హర్షించలేం. ఎందుచేతనో!

అప్పుడే అక్కడికొచ్చి నాలుగు రోజులైంది. మరో రోజు కూడా అదనంగా వుండిపొయ్యాను. రాత్రి బండికి ప్రయాణం స్థిర పరచుకుని, మధ్యాహ్నం కరుణాకరాన్ని చూడ్డాని కెళ్ళాను. మనిషి కుంగి చాలా నీరసించిపొయ్యాడు. నన్ను చూడగానే లేచి కూర్చు న్నాడు. నాకు చేతనైనట్టుగా ధైర్యం చెప్పి, వోదార్పు మాట లాడాను. ఇతర రోగుల సంసారం గొడవలు చెప్పాడు. వాళ్ళల్లో కొందరితో అతనికి బాగా స్నేహం ఏర్పడింది. వాళ్ళల్లో వారికి, యీర్ష్యలు లేకపోలేదు. తగ్గిందని డాక్టర్లు హామీ యిచ్చి, ఎవర్నైనా పంపించి వేస్తే, ఆ రోగిని చూసి హేళన చేస్తారుట: కొత్తగా వొచ్చినవాణ్ణి విరోధిగా భావించి, దూరంగా వుంచుతారట. ఎక్కువ రోజులు శానిటోరియమ్‌లో ఉన్నవాడికి వారిలో గౌరవం, పలుకుబడి, వో రకం నాయకత్వం కూడా లభిస్తుండిట.

సాయంత్ర మైంది. నేను వెడతా నని లేచాను. అతనూ లేచాడు.

"ఇంకో గంటదాకా యిక్కడే గడపొచ్చు" అన్నాడు.

నే నింక, కామేశం, సుగుణల విషయం, అతనితో ప్రస్తా వించి ఉత్సాహం కలగచెయ్యగూడ దనుకొని నిశ్చయించు కున్నాను.

"నాలు అప్పకుండా, నెలరోజుల్లో కుదిరిపోతుంది. ఎప్పుడు యిక్కడనుంచి బైటపడదామా అని ఘడియలు లెక్కపెడుతున్నాను. నాకోసం కాదు, కామేశంకోసం." అని తల వాల్చాడు.

"ఇప్పు డవన్నీ ఎందుకు తల్చుకుంటావు? అవన్నీ గడిచి పోయినాయి. నీ వొళ్ళు విషయం చూసుకో."

"నాకిక్కడ బందిఖానా వున్నంతకాలం, వాళ్ళకక్కడా బందిఖానాయే. నేను వొంటిగాణ్ణి—ఎక్కడికో ఏకాంతంగా పోయి బ్రతుకుతాను."

కన్నీటితో కళ్లు తడిసినాయి—కాని బొట్లుకింద కారే తీవ్రత లేదు. చర్మం ఎండిపోయి, పొడిపొడిగా అయింది—ఆవిరిగా మారి పోతూన్న కన్నీరు బైటకి రావడంలేదు. నా కళ్లు చెమ్మగిల్లినై. రుమాలు కళ్ళకి అదుముకున్నాను.

"కరుణాకరం—ఆ ప్రశ్న మళ్ళా అడుగనా?"

"నాకు తెలుసు. సుగుణని ప్రేమించలేదు."

"మరి—?"

"ఆ రోజుల్లో ఆమెకి ప్రేమ, ఆదరణ కావాలి. నేను వాటి నివ్వడానికి యత్నించాను. అతనికి ఉపచారంచేసినట్లే, అతని శరీరంలో వ్యాధి—ఆమె హృదయంలో గాయం రెంటినీ మాన్పడానికి నా యత్నం. ఎవరి కర్థమవుతుంది?"

"ఆమె వేసిన వొట్లు, ప్రమాణాలు....?"

"హృదయం క్షణక్షణం జీవిస్తుంది, ఆశిస్తుంది, అనుభవిస్తుంది—అంతే. శాశ్వతాన్ని ఆదేశించదు. మనం శాసిస్తాం. శరీరాలకి లేని అమరత్వం ఆత్మలకెల్లా వొస్తుంది! రావాలని కోరడం మనం ఆత్మకిచేసే అన్యాయం. అసలు యీలోకంలో ఎవ్వరూ, ఎవ్వర్నీ ప్రేమించలేరు. మనుషులకి కావల్సింది ప్రేమకాదు. ప్రేమ శరీరానికి కావాలి. హృదయం కోరేది కాస్తంత దయ, కొంచెం ఆప్యాయత, ఆదరణ—అంతే...."

రెండుచేతులు కళ్ళకి అదుముకున్నాడు, ఏడ్పువల్ల అతని శరీరం వింతగా వొణికిపోయింది. మనిషి అవయవాలన్నీ విడిపోయి

నగ్న హృదయాన్ని బైటపడేశాడు—టి. బి. వొదిలేసిన హృదయం తునక.

నా కెందుకో వొక్కసారి సుగుణమీద సానుభూతి బయలు దేరింది. ఆమె హృదయాని క్కావల్సింది దయ, ఆదరణ. భర్త నిమ్మని కోరుతోంది. అంతే. కామేశం దాన్ని కామం అనుకుని తృణీకరిస్తున్నాడు. అప్పుడు కరుణాకరం తృణీకరించాడు. ఆ వ్యక్తులు, ఆ పరిస్థితులు మళ్ళా ఎప్పుడూ రావు. అవి అపూర్వం. వాటిని విమర్శించి విలువలు కట్టడం అవివేకం.

కరుణాకరం బాధ చూస్తే నాకు భయమేసింది. అతనేమన్నా అఘాయిత్యం చెయ్యడుకదా, ఆధార మేమీ లేదు మళ్ళా. అతన్ని లేవదీసి మంచందగ్గరకు తీసుకువెళ్ళాను.

“ఇందులోంచి ఏదేనా కథల్లుదా మనుకుంటున్నావా? నే జీవించి వుండగా అల్లా చెయ్యకుసుమా.”

“నా కా అభిప్రాయం లేదు. అనుభవం స్వంత దైనప్పుడే దాన్నుండి విముక్తి పొందటంకోసం వ్రాస్తానేమో. పైగా, మరీ మహత్తరమైన అనుభవాన్ని, ఎవరూ కళకోసం ఉపయోగించుకో లేరనుకుంటా” అన్నాను.

“అనుభవం బాగా జీవించడాని కుపయోగపడనప్పుడు, కళకి మాత్రం ఎట్లా వుపయోగపడుతుందిలే....”

అని నవ్వి, వొరగిల్లాడు. మళ్ళా పదిరోజుల్లో వొస్తానని చెప్పి, నే వొచ్చేశాను.

సరిగ్గా పదిరోజుల తర్వాత, నే కథ వ్రాద్దామని కూర్చుండగా అతని దగ్గరనుంచి రమ్మనమని టెలిగ్రాం వొచ్చింది. ఎందుకు రమ్మన్నాడో నేను వూహించలేనా? ఈ కథ ప్రారంభంలోనే చెప్పేశాను. వెంటనే బైలుదేరాను. అతనికి తగ్గిందనీ, శానిటోరియమ్ నుంచి డిశ్చార్జ్ చేశారనీ, మళ్ళా సుగుణతో ఏదో పేచీ వొచ్చిందనీ, నా సలహాకోసం రమ్మన్నాడనీ, వూహించాను.

కాని నేను పొరబడ్డాను. ‘సంతోషి’లో కామేశం లాడ్జిలో ఎవ్వరూ లేరు. వా రుభయులూ వారం క్రితం వూరెళ్ళిపొయ్యారుట.

తొందరగా శానిటోరియమ్ కెళ్ళాను. వార్డ్‌బోయ్ చెప్పాడు, ఉదయమే కరుణాకరం చనిపోయాడని. డాక్టర్లనీ, నర్సులనీ కను-క్కున్నాను. వారందరూకూడా ఎట్లా చనిపోయాడా అని ఆశ్చర్యపడ్డారు. నాలుగు రోజుల క్రితంనుంచి జబ్బుధోరణి మారిందనీ, బాగుపడిందనీ, టెంపరేచర్ పూర్తిగా నిల్చిపోయిందనీ డాక్టర్లన్నారు. లోపల హెమరేజ్ అయివుండాలని సూచించినా, ఆ సమాధానం వారికే తృప్తిగా లేదు.

అతని బెడ్డింగ్, హోల్డాల్—అన్నీ సర్ది నాకు వప్పజెప్పారు. నా కోవుత్తరం పోస్టుకి సిద్ధంచేసుంది. కవరు చించి చదివాను,

"నాకు పూర్తిగా నయమైం దన్నారు డాక్టర్లు, మరో వారంలో డిశ్చార్జ్ చేస్తారుట. నా కెంతో ఆనందంగా వుంది. రామేశంకూడా, హాయిగా, భార్యతో వూరి కెళ్ళాడు. ఇక్కడంతా టి. బి. రోగులు. నా సంతోషం ఎవరితో పంచుకోను-? టెలిగ్రాం కూడా యిద్దా మనుకుంటున్నాను. ఇన్నాళ్ళకి ముక్తి—కరుణాకరం."

నేనల్లా, ఎక్కడికో తెలీకుండా నడిచిపోతున్నా. హాస్పిటల్ వాన్, రోగి కాండ్రించి ఉమ్మేసినట్లు ధ్వనించి, పక్కనుంచి వెళ్ళింది. దూరంగా, బైలుకేసి, గుట్టల్లోకి నడిచిపోయాను.

ఆనందం పంచుకుంటా నని, దుఃఖం దిగవిడిచి పొయ్యాడు కరుణాకరం.

చటుక్కున నా మనస్సుకి నో భావం స్ఫురించింది. అ దేమిటో చెప్పేసి, తర్కించి, పాఠకుల కాలం వృథాపర్చడం అన్యాయమని వొదిలేస్తున్నా.

———